

ప్రజల మద్దతుతో ఏడు దఫాలుగా వరుస విజయాలు సాధిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయాన్ని చీకటి గెలుపుగా అభివర్ణించడం ప్రజల తీర్పును అవమానించడమే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

గురువారం 26.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 215 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



పొలసీలతో ఆదాయానికి ఊతం

పన్నులు పెంచకుండానే రాబడి పెంపునకు కార్యాచరణ

నవంబరు నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లు

గత ఏడాదితో పోలిస్తే 18.7 శాతం వృద్ధి

2027 మార్చి నాటికి వంద శాతం ఫలితాలు సాధించాలని లక్ష్యం

ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబర్ 25 (జర్నలిస్ట్‌ఫైల్) : ప్రజలపై అదనపు పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వ శాఖల ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆదాయార్జన శాఖలపై బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గడచిన రెండున్నరేళ్లుగా ప్రభుత్వ నిర్ణయాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, వివిధ ప్రభుత్వ శాఖల్లోని వ్యవస్థలు గాడిలో పడ్డాయని సీఎం అన్నారు. ఆదాయ లీకేజీలను తగ్గించడం, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడంలో పలు శాఖలు మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో పారదర్శకత, ఆన్‌లైన్ సేవలు, శాఖాపరమైన సంస్కరణలతో ఆదాయం పెరుగుతోందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ఆదాయంలోనూ ప్రతిఫలించాలని సీఎం చెప్పారు. ప్రతీ వారం ఆదాయ ఆర్జనలపై దృష్టి సారిస్తూ... ఆ మేరకు నివేదికలు సిద్ధం చేసుకోవాలని... అవసరమైన మేరకు మార్పులు చేర్పులు చేసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ ప్రత్యేక ఏఐ స్టాక్ ద్వారా ఆదాయాలను మెరుగు పర్చుకోవాలని స్పష్టం చేశారు. సమన్వయంతో డేటా లేక్ ద్వారా సమాచారాన్ని విశ్లేషించి ఎక్కడా రెవెన్యూ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. 2027 మార్చి నాటికి వంద శాతం వ్యవస్థల్లో మెరుగుదల చూపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, పురపాలక, పంచాయితీరాజ్, అటవీశాఖల లాంటి ఆదాయార్జన శాఖలు సాంకేతికతను అమలు చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు వివిధ శాఖల్లో నమోదైన వృద్ధిని నమోదు చేయాలన్నారు. భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు సూచించారు. మద్యం తయారీ నుంచి విక్రయం వరకూ ట్రాకింగ్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాహనాల లోడ్, ఇ-వేబిల్స్ సహా వివిధ అంశాలపై రవాణా శాఖ ఎలక్ట్రానిక్ విధానంలో పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

వార్షిక లక్ష్యంలో ఇప్పటికే సమకూరిన 58 శాతం ఆదాయం : 2026-27 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 23 నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ. 74,342 కోట్లకు చేరిందని అధికారులు సమీక్షలో వివరించారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ. 62,604 కోట్లుగా ఉన్న ఆదాయం ఈసారి రూ. 11,738

మిగతా 3లో...

శ్రీవారి చెంతకు సీఎం



- నేడు తిరుమల పర్యటన
- సీఎం సమక్షంలో 121 కిలోల బంగారు ఆభరణాల సమర్పణ
- టీటీడీకి కిరీటం, పద్మపాదాల ఆభరణాల అందజేత

2 లో

మనోహర్.. అదరహో!



- నాటు నాటు పాటకు దివ్యాంగ బాలుడి నృత్యం
- షాట్‌పుట్ అథ్లెట్‌గా, గాయకుడిగా ప్రతిభ
- లోకేశ్ ప్రశంసలు.. ఆర్టీటీ సేవలకు అభినందనలు

2 లో

కార్యకర్తే అధినేత..

డిజిటల్ వేదికపై సరికొత్త చరిత్ర!

'మైటీడీపీ'లో 10 లక్షల మంది నమోదు

ప్రాంతీయ పార్టీల్లో అరుదైన మైలురాయి

నారా లోకేష్ ఆలోచనలతో సమగ్ర డిజిటల్ వ్యవస్థ



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): కార్యకర్తే అధినేత... ఇది తెలుగుదేశం పార్టీకి కేవలం నినాదం మాత్రమే కాదు. ఆచరణలో చేసి చూపిస్తున్న సిద్ధాంతం. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు పార్టీ సంస్థాగత బలోపేతంలోనూ సరికొత్త డిజిటల్ విప్లవానికి నాంది పలికింది. పార్టీకి, కార్యకర్తలకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన 'మైటీడీపీ' యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షలకు చేరుకుంది. దేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీల డిజిటల్ ప్రయాణంలో తెలుగుదేశం పార్టీ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది.

మిగతా 2లో...

కార్యకర్తల చైతన్యానికి నిదర్శనం!

మై-టీడీపీ యాప్‌కు 10 లక్షల డౌన్‌లోడ్లు

అరుదైన మైలురాయిగా అభివర్ణించిన చంద్రబాబు

యాప్ రూపకల్పనలో కృషికి లోకేశ్‌కు అభినందనలు

నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

- **డిసెంబర్ తొలి వారం నుంచి రేషన్‌లో కందిపప్పు, పామాయిల్**



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ధరల నియంత్రణ, ప్రజలకు అందుబాటు ధరల్లో సరుకులు అందించడం లక్ష్యంగా సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై వంటింటి ఖర్చుల భారం తగ్గించేలా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత సమర్థంగా వినియోగించాలని అధికారులకు సూచించారు.

డిసెంబర్ మొదటి వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకు కందిపప్పు, పామాయిల్ పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు. కిలో కందిపప్పును రూ.100కు, లీటరు పామాయిల్‌ను రూ.125కు అందించాలని నిర్ణయించారు. ఈ చర్యల ద్వారా సామాన్య కుటుంబాలకు నిత్యావసరాల కొనుగోలులో ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

మిగతా 2లో...

విశ్వసుందరిగా ప్యూర్టోరికో భామ



శాన్‌జువాన్: 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. మిస్ యూనివర్స్ చరిత్రలో తల్లిగా ఉంటూనే ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని దక్కించుకున్న తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. గత ఏడాది విజేత, మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్.. జెన్నిఫర్‌కు కిరీటాన్ని అలంకరించారు. ప్యూర్టోరికో రాజధాని శాన్‌జువాన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 116 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొన్నారు. డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా నునెజ్ మొదటి రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా వేగాస్ రెండో రన్నరప్‌గా నిలిచారు.

మిగతా 3లో...

అయ్యప్ప భక్తుల కోసం 204 ప్రత్యేక రైళ్లు

- దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కేరళకు ప్రత్యేక సర్వీసులు
- విశాఖ, విజయవాడ, హైదరాబాద్ నుంచి రైళ్లు
- రద్దీకి అనుగుణంగా మరిన్ని సర్వీసుల నిర్వహణకు ప్రణాళిక

మిగతా 3లో...



అక్రమ ఇసుక తవ్వకాలపై సీఎం సీరియస్

పైప్‌లైన్ ధ్వంసంపై పూర్తిస్థాయి నివేదిక కోరిన చంద్రబాబు

కేసులు, చర్యల వివరాలను సీఎంవోకు అందించిన కలెక్టర్

అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం

2 లో

వన్యప్రాణులకు రక్షణ కవచం



- 69 వేట ఉచ్చులను తొలగించిన అటవీ సిబ్బంది
- పవన్ కళ్యాణ్ అభినందనలు
- అడవుల్లో నిరంతర గస్తీకి ఆదేశాలు

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : అటవీ సంపదను, వన్యప్రాణులను పరిరక్షించడంలో నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ,

మిగతా 2లో...

రైతుకు ఎరువుల భరోసా!

- యూరియా ఉత్పత్తి పెంపునకు కేంద్రం భారీ కార్యాచరణ
- ఆరు ప్రాజెక్టులకు రూ.54 వేల కోట్ల పెట్టుబడులు
- దిగుమతుల తగ్గింపు.. సరఫరాలో స్థిరత్వానికి చర్యలు



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): దేశీయంగా యూరియా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, ఎరువుల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా-2026 కింద మొత్తం రూ. 54 వేల కోట్ల పెట్టుబడితో ఆరు బ్రౌన్‌ఫీల్డ్ గ్యాస్ ఆధారిత యూరియా ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేటు, సహకార రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు ఇప్పటికే ఉన్న ప్లాంట్ల ఆధునీకరణ, సామర్థ్య విస్తరణకు దోహదపడనున్నాయి.

మిగతా 2లో...

జాప్యానికి తావివ్వొద్దు!

- జాతీయ ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేయాలి
- రాష్ట్రాల సీఎస్‌లకు ప్రధాని మోదీ ఆదేశాలు
- పీఎం-సేతు పథకం అమలుపై ప్రత్యేక దృష్టి



అమరావతి, నవంబరు 25 (జర్నలిస్ట్‌ఫైల్) : దేశవ్యాప్తంగా ప్రగతి కార్యక్రమం కింద చేపట్టిన జాతీయ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. బుధవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన వీడియో సమావేశంలో

మిగతా 2లో...

నిత్యావసరాల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ మార్కెట్‌లో బియ్యం, ఉల్లిపాయలు, పామాయిల్ ధరల పరిస్థితిపై అధికారులు సమీక్షలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ చర్యలతో కొన్ని నిత్యావసరాల ధరలు తగ్గుముఖం పట్టాయని నివేదించారు. నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని సీఎం సూచిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 286 ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను 500కు విస్తరించాలని ఆదేశించారు. దీనివల్ల ప్రజలకు అందుబాటు ధరల్లో బియ్యం లభించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, సబ్సిడీ సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మార్కెట్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో నిత్యావసరాల కొరత తలెత్తకుండా వ్యవసాయ రంగంలోనూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ విధానం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు వినియోగదారులకు ఏడాది పొడవునా నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

కార్యకర్తల చైతన్యానికి నిదర్శనం!

అమరావతి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగుదేశం పార్టీ రూపొందించిన మైటీడీపీ (వీఐజ్ఞా) యాప్‌ను 10 లక్షల మంది కార్యకర్తలు డౌన్‌లోడ్ చేసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రయాణంలో అరుదైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఈ విజయం వెనుక కృషి చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మైటీడీపీ యాప్ కేవలం సభ్యత్వ నమోదుకే పరిమితం కాకుండా, పార్టీ నాయకత్వానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలకు మధ్య ఒక బలమైన వారధిగా నిలుస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపును ఇచ్చే శక్తివంతమైన వేదికగా ఈ యాప్ రూపొందిందని తెలిపారు. భారీ స్థాయిలో యాప్ డౌన్‌లోడ్లు నమోదు కావడం కార్యకర్తల అంకిత భావానికి, సాంకేతిక చైతన్యానికి నిదర్శనమని సీఎం కొనియాడారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ నుంచి ప్రతి కార్యక్రమం యాప్ ద్వారా పార్టీ కి అందుబాటులో ఉంటుందని చంద్రబాబు అన్నారు. పని చేసిన వారిని గుర్తించడం లో ఇలాంటి సాంకేతికతను అధిష్టానం ఉపయోగించు కుంటుందని చంద్రబాబు అన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కవచం



(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అక్రమ వేటను అరికట్టేందుకు అటవీ సిబ్బంది చేపట్టిన ప్రత్యేక పెట్రోలింగ్‌లో 69 వేట ఉచ్చులను గుర్తించి తొలగించారు. బుధవారం మారేడుమిల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 26/4లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించి, వన్యప్రాణులను అక్రమంగా వేటాడేందుకు మూడు చక్రాల వాహనాల బ్రేక్ వైర్లతో ఏర్పాటు చేసిన 69 ఉచ్చులను గుర్తించారు. వాటిని తొలగించి వన్యప్రాణులకు పొంచి ఉన్న ముప్పును నివారించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, యానిమల్ ట్రాకర్లు, బేస్ క్యాంప్ సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రశంసించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అడవుల్లో నిరంతర గస్తీ, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తత, సమష్టి కృషి వల్ల అనేక వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు తప్పిందని పేర్కొన్నారు. అక్రమ వేట నిరోధానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. బ్రేక్ వైర్లతో ఉచ్చుల తయారీని నియంత్రించే చర్యల్లో భాగంగా ఆటోమొబైల్ షాపుల యజమానులు, మోటార్ మెకానిక్‌లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అడవుల్లో అమర్చే ప్రతి ఉచ్చు ఒక వన్యప్రాణి ప్రాణానికి ముప్పుగా మారుతుందని, వాటిని గుర్తించి తొలగించడం ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కీలకమైన సేవ చేసినట్లవుతుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వేటగాళ్ల నుంచి వన్యప్రాణులను రక్షించేందుకు అటవీ ప్రాంతాల్లో నిరంతర నిఘా, ప్రత్యేక పెట్రోలింగ్ వంటి చర్యలను మరింత పటిష్టం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల సంరక్షణలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు.

మనోహర్.. అదరహో!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : సంకల్పం, ఆత్మవిశ్వాసం ఉంటే శారీరక పరిమితులను అధిగమించి ప్రతిభను చాటుకోవచ్చని నిరూపిస్తున్న దివ్యాంగ బాలుడు మనోహర్‌పై మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన మనోహర్ డ్యాన్స్ వీడియోను చూసిన మంత్రి, అతడి ప్రతిభను అభినందిస్తూ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

'నాటు నాటు' పాటకు మనోహర్ ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో పలువురిని ఆకట్టుకుంది. ఈ వీడియోను చూసిన నారా లోకేశ్ మనోహర్ గురించి వివరాలు తెలుసుకుని, అతడి ఆత్మవిశ్వాసం, పట్టుదలపై స్పందించారు. విధి సైతం అతడి సంకల్పానికి చప్పట్లు కొట్టి అభినందించాల్సిందేనని పేర్కొంటూ, మనోహర్ ఆత్మవిశ్వాసం అద్భుతమని కొనియాడారు.

డ్యాన్స్‌లోనే కాకుండా మనోహర్ షాట్‌పుట్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడని, పాటలు కూడా పాడుతున్నాడని తెలుసుకుని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఒకే సమయంలో పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్న మనోహర్ కృషి, పట్టుదల ఇతరులకు స్ఫూర్తినిస్తాయని అభిప్రాయపడ్డారు. మనోహర్ వంటి దివ్యాంగులకు విద్య, క్రీడలు, జీవన నైపుణ్యాలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న ఆర్డీటీ సంస్థ సేవలను కూడా నారా లోకేశ్ ప్రశంసించారు. సంస్థలో వందలాది మంది దివ్యాంగులకు నైతిక విలువలతో కూడిన విద్య, క్రీడలు, జీవన నైపుణ్యాల శిక్షణ అందిస్తున్నారని తెలిసి ఆనందం కలిగిందని పేర్కొన్నారు.

ఆకాశమే హద్దుగా ముందుకు సాగుతున్న దివ్యాంగ బాలబాలికలు భవిష్యత్తుకు వెలుగుదీపాలుగా నిలుస్తున్నారని, వారు నిండైన ఆత్మవిశ్వాసానికి ప్రతీకలని మంత్రి కొనియాడారు. మనోహర్‌తో పాటు ప్రతిభను చాటుకుంటున్న బాలబాలికలందరికీ అభినందనలు, ఆశీస్సులు అందజేశారు.

కార్యకర్తే అధినేత.. డిజిటల్ వేదికపై సరికొత్త చరిత్ర!

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్త కష్టానికి గుర్తింపు.. సామాన్య కార్యకర్తలకు పదవులు : ఒకప్పుడు మారుమూల గ్రామంలో పార్టీ జెండా మోసే కార్యకర్త పడిన కష్టం పార్టీ అధిష్టానానికి తెలియడం అంత సులభం అయ్యేది కాదు. ఆ పరిస్థితిని 'మైటీడీపీ' యాప్ మార్చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు కల్పించేందుకు ఈ యాప్‌ను రూపొందించారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలు, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసే కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారం, సేవా కార్యక్రమాల వివరాలను కార్యకర్తలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ఏ కార్యకర్త ఎంత చురుగ్గా పనిచేస్తున్నారనే విషయం నేరుగా పార్టీ నాయకత్వానికి తెలుస్తోంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతోమంది సాధారణ కార్యకర్తలకు కార్పొరేటర్లు, సర్పంచులుగా అవకాశాలు లభించాయి. పార్టీ, నామినేటెడ్ పదవుల్లోనూ కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యం దక్కుతోంది. అటువంటి కార్యకర్తలను గుర్తించడంలో 'మైటీడీపీ' యాప్ ద్వారా అందుతున్న పనితీరు వివరాలు కీలకంగా మారాయి.

కార్యకర్త నుంచి అధినేత వరకు నేరుగా అనుసంధానం : పార్టీ అధినేత సందేశాలు, నాయకత్వం ఇచ్చే సూచనలు, పార్టీ కార్యక్రమాల వివరాలు క్షణాల్లో కార్యకర్తలకు చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, సమస్యలు నేరుగా పార్టీ నాయకత్వానికి చేరుతున్నాయి. పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తల స్పందనను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వారి సూచనలకు ప్రాధాన్యం ఇచ్చేలా యాప్‌ను రూపొందించారు. కార్యకర్తలకు సమాచారం అందించడమే కాకుండా, కార్యకర్తల నుంచి సమాచారాన్ని సేకరించే సమగ్ర డిజిటల్ వ్యవస్థగా 'మైటీడీపీ' పనిచేస్తోంది.

డిజిటల్ మహానాడుతో సరికొత్త ఒరవడి : తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడులోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి డిజిటల్ మహానాడుకు శ్రీకారం చుట్టారు. కార్యకర్తల నమోదు, హాజరు, కార్యక్రమాల నిర్వహణలో డిజిటల్ వ్యవస్థను వినియోగించడం ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికారు. కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతులు, ఇతర పార్టీ కార్యక్రమాల నిర్వహణలోనూ 'మైటీడీపీ' కీలక పాత్ర పోషిస్తోంది.

కార్యకర్త చేతిలోనే పార్టీ డిజిటల్ వ్యవస్థ :
ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాలతో పాటు పార్టీ పిలుపునిచ్చే వివిధ కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ.
క్షేత్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు.
కార్యకర్తలు తాము నిర్వహించిన కార్యక్రమాల వివరాలు, ఫొటోలను యాప్‌లో ప్రచురించుకునే అవకాశం.
పార్టీ నాయకుల కార్యక్రమాలు, ఫొటోలు, పార్టీకి సంబంధించిన తాజా సమాచారం అందుబాటులో ఉంచడం.
సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలు, సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.
కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలను ఎప్పటికప్పుడు సేకరించడం.
కార్యకర్తల సమావేశాలు, శిక్షణా తరగతులు, పార్టీ కార్యక్రమాల హాజరు నమోదు.
కార్యకర్తల ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం.

ఫొటో బూత్ ప్రత్యేక ఆకర్షణ : పార్టీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. సమావేశాలకు హాజరైన కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్నారు. ఆ ఫొటోలను



'మైటీడీపీ' యాప్ ద్వారా నేరుగా కార్యకర్తలకు అందించేలా ప్రత్యేక సదుపాయం కల్పించారు. కార్యకర్తలు ఒక్కసారి యాప్‌లో తమ ముఖాన్ని స్కాన్ చేసుకుంటే చాలు... ఆ తర్వాత పార్టీ అధినేతతో, నారా లోకేష్‌తో ఎప్పుడు ఫొటో దిగినా, సంబంధిత ఫొటోలు యాప్‌లోని 'ఫొటో బూత్' విభాగంలోకి నేరుగా వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఈ సదుపాయం కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకుంటోంది.

మరుగ్గా పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు : 'మైటీడీపీ' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. నారా లోకేష్ నియోజకవర్గాల పర్యటనల సందర్భంగా యాప్ ద్వారా అప్పగించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిన కార్యకర్తలను గుర్తించి, వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందనే భరోసాను కల్పిస్తున్నారు.

'మైటీడీపీ' వినియోగంలో ముందంజలో ఉన్న నియోజకవర్గాలు : రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల నుంచి 'మైటీడీపీ' యాప్‌కు విశేష స్పందన లభిస్తోంది. యాప్ వినియోగం, పార్టీ కార్యక్రమాల నమోదులో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన నియోజకవర్గాలు ఇవే.
పార్లమెంట్ నియోజకవర్గాలు: నరసరావుపేట, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు.
అసెంబ్లీ నియోజకవర్గాలు: కుప్పం, వినుకొండ, కనిగిరి, మంగళగిరి, గన్నవరం.
రాజకీయాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి కొత్త నిర్వచనం : దేశంలో అనేక రాజకీయ పార్టీలకు డిజిటల్ వేదికలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కార్యకర్త పడే కష్టాన్ని గుర్తించడం, వారి పనితీరును తెలుసుకోవడం, అభిప్రాయాలను నేరుగా సేకరించడం, ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించడం వంటి ప్రత్యేకతలతో 'మైటీడీపీ' యాప్‌ను తీర్చిదిద్దారు. కేవలం పార్టీ సమాచారాన్ని కార్యకర్తలకు చేరవేసే వేదికగా కాకుండా, కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి ఉపయోగపడే సమగ్ర డిజిటల్ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారు.
10 లక్షల మంది... ఒకే పసుపు కుటుంబం : 'మైటీడీపీ' యాప్‌లో 10 లక్షల మంది నమోదు చేసుకోవడం కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. పార్టీ పట్ల కార్యకర్తలకు ఉన్న అంకితభావానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వారి చైతన్యానికి నిదర్శనం. ఒకప్పుడు కార్యకర్త పడిన కష్టం పార్టీకి తెలియడం కష్టంగా ఉండేది. ఇప్పుడు కార్యకర్త వేసే ప్రతి అడుగూ పార్టీకి తెలుస్తోంది. కార్యకర్త కష్టానికి గుర్తింపు, ప్రతిభకు ప్రోత్సాహం, అంకితభావానికి తగిన అవకాశాలు కల్పిస్తూ 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తోంది తెలుగుదేశం పార్టీ. కార్యకర్తే పార్టీకి బలం... కార్యకర్తకు బలం 'మైటీడీపీ'.

రైతుకు ఎరువుల భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధానం కింద మొత్తం 18 ప్రతిపాదనలు అందగా, వాటిలో ఆరు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. చెన్నైలోని మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎంఎఫ్ఎల్), పంజాబ్‌లోని నంగల్ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్), ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ కృషిభారతి కోఆపరేటివ్ లిమిటెడ్ (క్రిభ్కో), పశ్చిమ బెంగాల్‌లోని పనాగఢ్ మ్యాటిక్స్ ఫెర్టిలైజర్స్, రాజస్థాన్‌లోని గడేపాన్ చంబల్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, ఉత్తరప్రదేశ్‌లోని జగదీశ్‌పూర్ ఐజీపీఎల్ ప్రాజెక్టులు ఈ జాబితాలో ఉన్నాయి.

ఈ ప్రాజెక్టుల్లో పాత యూరియా ప్లాంట్ల స్థానంలో ఆధునిక సాంకేతికతతో కొత్త యూనిట్లను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడం ప్రధానంగా చేపట్టనున్నారు. మద్రాస్ ఫెర్టిలైజర్స్‌లో ఆరు దశాబ్దాలకు పైగా పాతదైన యూనిట్ స్థానంలో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. పంజాబ్‌లోని నంగల్ ప్లాంట్‌లో 1978లో ప్రారంభించిన యూనిట్ స్థానంలో ఏడాదికి 12.7 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఆధునిక యూనిట్‌ను ప్రతిపాదించారు.



మిగిలిన ప్రాజెక్టులు కూడా ప్రస్తుత ప్లాంట్లను ఆధునీకరించడం, విస్తరించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నాయి.

ప్రతి ప్రాజెక్టుకు సుమారు రూ. 9 వేల కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విధానంలో 12 నుంచి 16 శాతం వరకు రాబడి (రిటర్న్ ఆన్ ఈక్విటీ) కల్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. విదేశీ మారకపు విలువల్లో వచ్చే మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు నాలుగేళ్ల తర్వాత స్థిర వ్యయాలను అప్పటి మారకపు రేటు ఆధారంగా రూపాయల్లోకి మార్చుకునే విధానం కూడా కల్పించారు. ఇప్పటికే ఉన్న భూమి, మౌలిక సదుపాయాలు, యుటిలిటీలు, రవాణా వ్యవస్థలు, సాంకేతిక సిబ్బందిని వినియోగించుకోవడం వల్ల ఒక్కో ప్రాజెక్టుకు ఏడాదికి సుమారు రూ. 225 కోట్ల వంకు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు.

దేశంలో ఏటా సుమారు 400 లక్షల టన్నుల యూరియా వినియోగం జరుగుతోంది. దేశీయ ఉత్పత్తి పెంపుతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు విదేశీ మారకద్రవ్య ఆదా, రైతులకు ఎరువుల సరఫరాలో స్థిరత్వం సాధించవచ్చని కేంద్రం భావిస్తోంది. 2014-15లో దేశీయ యూరియా ఉత్పత్తి 225 లక్షల టన్నులుగా ఉండగా, 2023-24లో రికార్డు స్థాయిలో 314.07 లక్షల టన్నులకు చేరింది. 2025-26లో ఉత్పత్తి 293.30 లక్షల టన్నులుగా నమోదైంది. తాజా పెట్టుబడులు, సామర్థ్య విస్తరణతో దేశీయ ఎరువుల ఉత్పత్తి వ్యవస్థ మరింత బలోపేతం కానుంది.

జాప్యానికి తావివ్వొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రగతి కార్యక్రమం కింద చేపట్టిన పలు జాతీయ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన పీఎం-సేతు పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని ప్రధాని సూచించారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఐటీఐలు) ఆధునీకరించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్రాల సీఎస్‌లకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచి, శిక్షణ పొందిన యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు.

పీఎం-సేతు (ప్రధానమంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫార్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్) పథకం ద్వారా దేశంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టింది. ఐదేళ్ల కాలానికి రూ. 60 వేల కోట్ల పెట్టుబడితో అమలు చేయనున్న ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ. 30 వేల కోట్లు, రాష్ట్రాలు రూ. 20 వేల కోట్లు, పరిశ్రమల భాగస్వాములు రూ. 10 వేల కోట్లు సమకూర్చనున్నారు. హబ్-అండ్-స్పోక్ విధానంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 1,000



ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించనున్నారు. ఇందులో 200 ఐటీఐలను ప్రధాన హబ్‌లుగా, వాటికి అనుబంధంగా మరో 800 ఐటీఐలను స్పోక్‌లుగా అభివృద్ధి చేయనున్నారు.

ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ కోర్సులను రూపొందించేందుకు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యాన్ని ఈ పథకం ప్రోత్సహిస్తుంది. ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా పరిశ్రమలు, ఐటీఐల మధ్య సమన్వయం పెంచి, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ శిక్షణ అందించడంతో పాటు ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచనున్నారు. పరిశ్రమల్లో మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా యువత ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ పథకం కింద దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ఆధునీకరణకు ఆమోదం లభించింది. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ భాగస్వామ్యంతో రూ. 200 కోట్ల పెట్టుబడితో నాలుగు ప్రభుత్వ ఐటీఐలను అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్రంలో మొత్తం 83 ఐటీఐలను ఆధునిక క్లస్టర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించడంతో పాటు శిక్షణ, ఉపాధి మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రగతి సమావేశంలో పలు జాతీయ ప్రాజెక్టుల పురోగతితో పాటు పీఎం-సేతు పథకం అమలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై ప్రధాని సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, నిర్ణయించిన లక్ష్యాలను సకాలంలో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని సూచించారు.

ఈ వీడియో సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ కార్యదర్శి, పీఎం ప్రగతి రాష్ట్ర నోడల్ అధికారి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జి.గణేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు : ఐజి రాజకుమారి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని ఐజి బి రాజకుమారి తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై పోలీసుశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి కఠిన చర్యలు తీసుకుంటోందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు



చేసుకోకుండా పోలీసు బందోబస్తును పటిష్టం చేశామన్నారు. ఇప్పటి వరకు 607 కేసులు నమోదు చేశామని, 213 మందిని అదుపులోకి తీసుకున్నామని, 1,785 మందికి నోటీసులు జారీ చేశామని, 25,207 బైండోవర్ కేసులు, 1,41,687 వ్యక్తులను బైండోవర్ చేశామని తెలిపారు. 37,942 ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, 9,337 డిపాజిట్ చేసిన ఆయుధాలు, 3,548.4 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ?

శ్రీవారి చెంతకు సీఎం



అమరావతి, నవంబర్ 25 (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం తిరుమలకు వెళ్లనున్నారు. రేపు ఉదయం 8.30 గంటలకు అమరావతి నుంచి తిరుమలకు బయల్దేరి వెళ్లనున్నారు. తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఓ భక్తుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 121 కిలోల బంగారు ఆభరణాలను సమర్పించనున్నారు. దాతల నుంచి బంగారు ఆభరణాలను టీటీడీ అధికారికంగా స్వీకరించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. రేపు ఉదయం అమరావతి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడి నుంచి ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణించి ఉదయం 10.45 గంటలకు తిరుమలలోని గాయత్రీ నిలయానికి చేరుకుంటారు. 11.10 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. దర్శనం అనంతరం ఉదయం 11.35 గంటలకు స్వామివారికి 121 కిలోల బంగారు ఆభరణాల సమర్పణ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. అనంతరం దాతల నుంచి శ్రీవారి కిరీటం, పద్మపాదాల ఆభరణాలను టీటీడీ అధికారికంగా స్వీకరించే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరుపతి నుంచి తెలంగాణాలోని భద్రాద్రి కొత్తగుడెం వెళ్లనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు తిరిగి ముఖ్యమంత్రి అమరావతికి చేరుకుంటారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై సీఎం సీరియస్



అమరావతి, నవంబర్ 25 (జర్నలిస్ట్ ఫైల్) : కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైపులైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఆయన, తక్షణమే పూర్తిస్థా

కాకినాడ హార్బర్‌కు సురక్షితంగా చేరుకున్న మత్స్యకార బోటు

- ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటులోని ఏడుగురు క్షేమం
- సకాలంలో స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయం
- ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం ముమ్మర గాలింపు
- కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ.. బంగ్లాదేశ్, మయన్మార్ సహకారం కోరేందుకు చర్యలు
- మత్స్యకారుల ప్రాణరక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి, నవంబర్ 25(జర్నలిస్ట్ ఫైల్) : కాకినాడ జిల్లా యేటిమొగ నుంచి చేపల వేటకు వెళ్లి ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటు సురక్షితంగా కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకోవడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డ్రైవర్‌తో సహా ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావడం వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. యేటిమొగకు చెందిన సెరు రామలక్ష్మి పేరుతో నమోదైన యాంత్రిక మత్స్యకార బోటు (×చీణ-్యూా-ఱు2-వీవీ-220) ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉప్పాడ-తుని తీరంలోని కృష్ణాపురం సమీపంలో నిలిచిపోయిందని వివరించారు. తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోటు నుంచి డ్రైవర్ దమ్ము అప్పారావు సమాచారం అందించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారన్నారు. అత్యవసర ఫోన్ కాల్ అందిన వెంటనే స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలోనూ వాకలపూడి ఇన్‌స్పెక్టర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా కోస్ట్‌గార్డ్, నౌకాదళ అధికారులకు సమాచారం చేరవేయడంతో పాటు మత్స్యశాఖతో సమన్వయం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. సముద్రపు నీటి లోతు తక్కువగా ఉండటంతో భారీ నౌకల రాకకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, బోట్ల యజమానుల సంఘం సహకారంతో సహాయక ప్రయత్నాలు చేపట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో వేగంగా స్పందించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఏడుగురి కోసం ముమ్మర గాలింపు : మరోవైపు కాకినాడ జిల్లా ఉప్పాడలోని సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 4న రెండు బోట్లలో పాథదీప్ వైపు చేపల వేటకు వెళ్లగా, ఒక బోటు 18న తిరిగి వచ్చిందన్నారు. మరో బోటులోని మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో 19న ఫిర్యాదు అందిందని, అప్పటి నుంచి సంబంధిత శాఖల సమన్వయంతో గాలింపు కొనసాగుతోందని వివరించారు. గల్లంతైన మత్స్యకారుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశామని మంత్రి తెలిపారు. వారి ఆచూకీ గుర్తించేందుకు అవసరమైన సహకారం కోరడంతో పాటు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సముద్ర జలాల వైపు వెళ్లి ఉండే అవకాశాలను కూడా పరిశీలిస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ ద్వారా ఆయా దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత తీర రక్షక దళం, నౌకాదళం, ఒడిశా అధికారులు, రాష్ట్ర మత్స్యశాఖ సమన్వయంతో గాలింపును మరింత వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని మంత్రి స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లే ముందు బోట్ల ఇంజిన్లు, ట్రాన్స్‌పాండర్లు, సమాచార వ్యవస్థలు, ఇతర రక్షణ పరికరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారుల ప్రాణరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. ఒక బోటులోని ఏడుగురు క్షేమంగా తిరిగి రావడం సంతోషకరం. గల్లంతైన మరో ఏడుగురిని కూడా సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రయత్నాలు చేస్తాం. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలి. ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

పాలసీలతో ఆదాయానికి ఊతం



(మొదటి పేజీ తరువాయి)

కోట్లు పెరిగి 18.7 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. రూ.1,27,506 కోట్ల వార్షిక లక్ష్యంలో నవంబర్ 23 నాటికి 58 శాతం సాధించినట్లు వెల్లడించారు. సమీక్షలో వివిధ శాఖల ఆదాయాలపై అధికారులు వివరిస్తూ పన్ను ఆదాయం గత ఏడాది ఇదే కాలంలో రూ.53,692 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.63,796 కోట్లకు చేరిందని... పన్నుల ద్వారా రూ.10,104 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని... పన్ను ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. వాణిజ్య పన్నుల ఆదాయం 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్లు పెరిగి రూ.38,241 కోట్లకు చేరిందని అధికారులు తెలిపారు. ఇందులో జీఎస్టీ ఆదాయం 18.1 శాతం వృద్ధితో రూ.3,694 కోట్లు పెరిగి రూ.24,073 కోట్లకు చేరిందని వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.20,083 కోట్లకు చేరిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.3,287 కోట్లు అదనంగా రావడంతో 19.6 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం 16.6 శాతం పెరిగి రూ.8,020 కోట్లకు, వాహన పన్నుల ఆదాయం 17.3 శాతం పెరిగి రూ.3,649 కోట్లకు చేరిందని అధికారులు స్పష్టం చేశారు. గనులు, భూగర్భ శాఖ ఆదాయం 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు, అటవీ శాఖ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.22 కోట్లకు చేరిందని అన్నారు. పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు పెరిగిందని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ: ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీలకు సుమారు రూ.239 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని, ఇదే కాలంలో పట్టణ స్థానిక సంస్థలకు సుమారు రూ.2,366 కోట్ల పన్ను ఆదాయం వచ్చిందని అధికారులు సమీక్షలో వివరించారు. ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపర్చేందుకు 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయ వ్యవహారాల్లో ఏఐని వినియోగిస్తున్నట్లు వివరించారు. పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో గత ఏడాది రూ.1,015 కోట్ల పన్నుల్ని డిజిటల్ గానే వసూలు చేసినట్టు అధికారులు తెలియచేశారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పదేళ్లలో రూ.18.08 లక్షల కోట్ల
రుణాలు రద్దు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రైటాఫ్..ఇదేదో రాత పనికి సంబంధించిన పని కాదు. కార్పొరేట్ కంపెనీలకు, పాలక అనుయాయులకు దోచిపెట్టడానికి నెపంగా చూపిస్తున్న ఒక నయవంచన. సామాన్య ప్రజలు, రైతులు, చేతివృత్తిదారులు తీసుకొనే చిన్నాచితక రుణాల పై..ఖాతాలో సొమ్ము లేదని, పరిమితి మించి లావాదేవీలు చేశారని, ఆలస్య రుసుములు, ప్రాసెసింగ్ ఫీజులు, అదనపు వడ్డీలు, అది సకాలంలో చెల్లించకుండా ఒక్క నిమిషం ఆలస్యమైనా భారీ మొత్తంలో భారాలు మోపి ముక్కుపిండి వసూలు చేసుకొనే బ్యాంకులు కార్పొరేట్ పెద్దల విషయంలో మాత్రం ఆ పని చేయకుండా వారికి అదనపు సేవలందిస్తున్నారు. భూరి మొత్తాలను నిరర్థక ఆస్తులుగానో..వసూలు కాని సొమ్ముగానో పేర్కొంటూ రూ.లక్షల కోట్ల సొమ్మును కార్పొరేట్ పెద్దలకు కైంకర్యం చేస్తున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ నయవంచన దోపిడి ఆకాశమే హద్దుగా యదేచ్ఛగా సాగుతోంది. గడిచిన పదేళ్లలో ఏకంగా రూ.18.08 లక్షల కోట్లను ఇలా మొండి బకాయుల ముద్ర వేసి మోడీ సర్కార్ రైటాఫ్ చేసేసింది. అంటే మాఫీ చేసిందన్నమాట. రిజర్వుబ్యాంకు గణాంకాలే ఈ దోపిడిని బహిర్గతం చేశాయి. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. పదేళ్లలో బ్యాంకులు ఏకంగా రూ.18.08 లక్షల కోట్ల మొండి రుణాలను ఖాతాల నుంచి తొలగించాయి. ఇందులో ఐదేళ్లలో కేవలం 13 శాతం మాత్రమే వసూళ్లయ్యాయని ఆర్‌బిఐ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం మాఫీలో తొలి పది బ్యాంకుల వాటానే రూ.11.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా వెల్లడైన ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. 2016-17 నుంచి 2025-26 వరకు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు రూ.18,07,812 కోట్ల రుణాలను రద్దు చేశాయి. 2018-19లో అత్యధికంగా రూ.2.39 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశాయి. అనంతరం కూడా వరుసగా రెండేళ్లు రూ.2 లక్షల కోట్లకు పైగా ఈ ప్రక్రియ కొనసాగింది. 2025-26లో రుణాల రద్దు 8.2 శాతం తగ్గి రూ.1.44 లక్షల కోట్లకు చేరినప్పటికీ.. పదేళ్ల మొత్తం మాత్రం రూ.18 లక్షల కోట్లను దాటడం ఆందోళకరం. ఈ భారీ మొత్తాల్లో ఎన్ని రుణాలు తిరిగి వసూలయ్యాయి? రుణాలు ఇచ్చే సమయంలో అనుసరించిన ప్రమాణాలు ఏమిటి? పెద్ద రుణగ్రహీతల విషయంలో బాధ్యతను ఎంత కఠినంగా నిర్ధారిస్తున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ?రుణాల మాఫీలో ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా అధికంగా ఉంది. ఎస్‌బిఐ పదేళ్లలో రూ.3,03,160 కోట్ల రుణాలను రైట్‌ఆఫ్ చేయగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.1,31,170 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,14,701 కోట్లు, యూనియన్ బ్యాంక్ రూ.1,13,112 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.1,03,949 కోట్ల రుణాలను రద్దు చేశాయి. ఈ ఐదు బ్యాంకుల మొత్తం రూ.7.66 లక్షల కోట్లుగా ఉంది. తొలి పది బ్యాంకుల రైట్‌ఆఫ్‌ల మొత్తం రూ.11.73 లక్షల కోట్లకు చేరింది. అంటే మొత్తం రైట్‌ఆఫ్‌లలో సుమారు 65 శాతం ఈ పది బ్యాంకుల నుంచే జరిగాయి. పెద్ద రుణాల విషయంలో వీడియోకాన్ గ్రూపు ఉదంతం ఈ సమస్య తీవ్రతను గుర్తుచేస్తోంది. వీడియోకాన్ మాజీ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్ వ్యక్తిగత హామీలకు సంబంధించిన రూ.12,668 కోట్ల రుణాల వ్యవహారంలో ఇటీవల నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) దివాలా ప్రక్రియకు సంబంధించిన చర్యలు చేపట్టింది. ఇందులో కేవలం రూ.600 కోట్లు చెల్లిస్తే చాలని తెలిపింది. ఆ తర్వాత ఇది తీవ్ర వివాదం కావడంతో తీర్పును వెనక్కి తీసుకుంది. మరోవైపు ఫ్యూచర్ గ్రూపు ప్రమోటర్లు కిషోర్ బియానీ, రాకేష్ బియానీలు దాదాపు రూ.24వేల కోట్లు మేర బ్యాంకులను ముంచారు. చిన్న రుణగ్రహీతపై ఒత్తిడి తెచ్చే బ్యాంకులు, భారీ రుణగ్రహీతల విషయంలోనూ అదే స్థాయి బాధ్యత, జవాబుదారీతనం చూపించాల్సిన అవసరం ఉంది. లేకపోతే బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ వసూళ్ల విధానం పేద, ధనిక రుణగ్రహీతల మధ్య వివక్షతో కూడుకున్నదనే అనుమానాలు మరింత బలపడతాయి.

అయ్యప్ప భక్తుల కోసం 204 ప్రత్యేక రైళ్లు



అమరావతి నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): శబరిమల మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్‌లో భక్తుల రాకపోకలను సులభతరం చేసేందుకు దక్షిణ రైల్వే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు కేరళకు చేరుకునేందుకు వీలుగా ఇప్పటివరకు 204 ప్రత్యేక రైలు ప్రయాణాలను ప్రకటించింది. ప్రయాణికుల రద్దీ, రిజర్వేషన్ల పరిస్థితిని బట్టి మరిన్ని ప్రత్యేక రైళ్లను నడిపేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రైల్వే వెల్లడించింది.

చెన్నై-కొల్లం, తిరుపనంతపురం-మంగళూరు, పన్వేల్-కోటాయం, విశాఖపట్నం-కొల్లం, హైదరాబాద్-కొల్లం, విజయవాడ-కోటాయం తదితర మార్గాల్లో ప్రత్యేక రైలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇతర రైల్వే జోన్ల సమన్వయంతో ఈ సర్వీసులను నిర్వహిస్తున్నారు. తీర్థయాత్ర సీజన్‌లో ప్రయాణికుల రద్దీని నియంత్రించడంతో పాటు భక్తులు తమ ప్రయాణాలను సౌకర్యవంతంగా ప్లాన్ చేసుకునేందుకు ఈ ప్రత్యేక రైళ్లు ఉపయోగపడనున్నాయి.

శబరిమల భక్తులకు ప్రధాన రవాణా కేంద్రాలుగా ఉన్న కోటాయం, చెంగన్నూరు, ఎర్నాకుళం జంక్షన్, ఎర్నాకుళం టౌన్ రైల్వే స్టేషన్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. కోటాయం స్టేషన్‌లో ఒకేసారి 900 మంది భక్తులు ఉండేందుకు వీలుగా మూడు అంతస్తుల యాత్రికుల సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మరుగుదొడ్లు, స్నానపు గదులు, లగేజీ భద్రపరిచే సదుపాయం, భోజన ప్రదేశాలు, మొబైల్ ఛార్జింగ్ సదుపాయాలు కల్పించారు. స్టేషన్ నుంచి తదుపరి ప్రయాణానికి వీలుగా ప్రత్యేక బస్సుల ఏర్పాట్లు కూడా చేశారు.

చెంగన్నూరు రైల్వే స్టేషన్‌లో మూడు విశాలమైన యాత్రికుల విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 600 మంది భక్తులకు వసతి కల్పిస్తున్నారు. అదనంగా ఏసీ వేచి ఉండే గది, విశ్రాంతి గదులు, ఆహార సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎర్నాకుళం జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి గదులు, క్యాటరింగ్ సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా కోటాయం, చెంగన్నూరు స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసి 24 గంటల పాటు టికెట్ సేవలు అందిస్తున్నారు. రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయ కేంద్రాలు కూడా నిరంతరం పనిచేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మార్గదర్శనం చేసేందుకు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని నియమించారు. టికెట్ కొనుగోలు, ప్రయాణ సమాచారం, స్టేషన్‌లోని సౌకర్యాల వినియోగం తదితర అంశాల్లో వీరు సహాయం అందించనున్నారు.

భక్తుల భద్రత కోసం రైల్వే స్టేషన్లు, రైళ్లలో అదనపు ఆర్‌పీఎఫ్ సిబ్బందిని నియమించి నిఘా పెంచారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పర్యవేక్షణ, ముందస్తు తనిఖీలు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు, నేరాల నివారణ బృందాల సేవలను వినియోగిస్తున్నారు. రైల్వే పోలీసుల సహాయ కేంద్రాలు కీలక స్టేషన్లలో నిరంతరం పనిచేస్తుండగా, ప్రయాణికుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్త చర్యలు చేపట్టాయి.

వైద్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైల్వే వైద్య విభాగం, సెయింట్ జాన్ అంబులెన్స్ బ్రిగేడ్, ప్రభుత్వ ఆరోగ్య శాఖల సమన్వయంతో క్విక్ రెస్పాన్స్ బృందాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు. మకరవిళక్కు రోజున కోటాయం, చెంగన్నూరు, ఎర్నాకుళం జంక్షన్ స్టేషన్లలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించి ప్రయాణికుల రాకపోకలు, ప్రత్యేక రైళ్ల నిర్వహణ, అదనపు టికెట్ కౌంటర్ల పనితీరును పర్యవేక్షించనున్నారు. తీర్థయాత్ర సీజన్‌లో భక్తుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లను రోజువారీగా సమీక్షిస్తూరైలు సేవలు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరుస్తామని దక్షిణ రైల్వే తెలిపింది.

ఎన్నికల భద్రతకు 46 వేలకుపైగా పోలీసుల మోహరింపు

- 23 పట్టణ స్థానిక సంస్థలు, తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు.. డ్రోన్లు, సీసీ కెమెరాలు, ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : గురువారం జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థలు, తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మొత్తం 46,350 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు. 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు 16,701 మంది, గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికలకు 29,649 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు.

ప్రధానంగా పల్నాడు నుంచి రాయలసీమ జిల్లాల వరకు ఎన్నికల భద్రత కోసం ప్రత్యేక బృందాలను విస్తృతంగా ఏర్పాటు చేశారు. జిల్లాల్లో అందుబాటులో ఉన్న పోలీసు బలగాలతో పాటు 127 ప్లాటూన్ల ఏపీఎస్పీ ప్రత్యేక బలగాలను కూడా ఎన్నికల బందోబస్తులో వినియోగిస్తున్నారు. రైల్వే, ఈగల్, ఇతర విభాగాలకు చెందిన సిబ్బందిని సైతం ఎన్నికల భద్రతా విధుల్లో నియమించారు. ఎస్పీ స్థాయి అధికారుల నుంచి హోంగార్డుల వరకు వివిధ హోదాల్లోని పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.

బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా 43 మంది ఎస్పీలు, 76 మంది అదనపు ఎస్పీలు, 179 మంది డీఎస్పీలు, 853 మంది సీఐలు లేదా ఆర్ఐలు, 1,832 మంది ఎస్సైలు లేదా ఆర్ఎస్ఐలు, 3,601 మంది ఏఎస్ఐలు లేదా ఏఆర్ఎస్ఐలు, 5,869 మంది సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు లేదా ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు, 21,252 మంది సివిల్ పోలీసు కానిస్టేబుళ్లు లేదా ఏఆర్ పోలీసు కానిస్టేబుళ్లు, 7,957 మంది హోంగార్డులు, ఏపీఎస్పీ, ఇతర విభాగాలకు చెందిన 4,688 మంది సిబ్బందిని ఎన్నికల భద్రత కోసం కేటాయించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీటీవీ కెమెరాలు, వీడియో చిత్రీకరణను వినియోగించనున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను నియమిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు.

ఫ్లైకింగ్ ఫోర్స్, స్పెషల్ ఫ్లైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పహారా ఏర్పాటు చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖ సిద్ధమైంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండేలా భద్రతా చర్యలను అమలు చేయనున్నారు.

విశ్వసుందరిగా ఫ్యూర్టోరికో భామ

(మొదటి పేజీ తరువాయి)

భారత్ తరపున బరిలోకి దిగిన కేరళకు చెందిన 19 ఏళ్ల కాజియా లిజ్ మెజో టాప్-30లో స్థానం సంపాదించారు. అయితే టాప్-12కు చేరుకోలేకపోయారు. ఫైనల్ రౌండ్‌లో ఐదుగురు పోటీదారులకు 'ప్రస్తుతం ప్రపంచానికి నాయకుల నుంచి ఏం కావాలి?' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జెన్నిఫర్ సమాధానమిస్తూ.. ప్రపంచానికి వృత్తిపరమైన నైపుణ్యంతో పాటు సహానుభూతి కలిగిన నాయకులు అవసరమని పేర్కొన్నారు. ఇతరులను విమర్శించే బదులు వారి పరిస్థితులను అర్థం చేసుకోవాలని, తమ విలువలకు కట్టుబడి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. ఆమె సమాధానం న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. మిస్ యూనివర్స్ పోటీలు 1952లో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజేత కోసం ప్రత్యేకంగా కిరీటాన్ని రూపొందించారు. 'ది రేడియన్స్ ఆఫ్ యూన్ ఎటర్నల్ లెగసీ' పేరుతో రూపొందించిన ఈ కిరీటంలో 3,150 వజ్రాలను పొదిగారు. జెన్నిఫర్ విజయంతో ఫ్యూర్టోరికోకు ఆరోసారి మిస్ యూనివర్స్ టైటిల్ దక్కినట్లయింది. గతంలో 1970, 1985, 1993, 2001, 2006 సంవత్సరాల్లో ఆ దేశానికి చెందిన అందాల భామలు ఈ ఘనత సాధించారు. తదుపరి 76వ మిస్ యూనివర్స్ పోటీలకు 2027లో వియత్నాం ఆతిథ్యమివ్వనుంది.

భారత్ సహా 14 దేశాలపై అమెరికా కొత్త టారిఫ్‌లు



వాషింగ్టన్: ట్రంప్ సర్కారు తమ వాణిజ్య భాగస్వాములపై మరోసారి సుంకాల వడ్డనకు సిద్ధమవుతోంది. భారత్, చైనా, జపాన్ సహా 14 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 25 శాతం వరకు సుంకాలు విధించాలని ప్రతిపాదించింది. ఆయా దేశాల్లో అధిక పారిశ్రామిక ఉత్పత్తి వల్ల అమెరికా వాణిజ్యంపై ప్రభావం పడుతోందన్న కారణంతో ఈ సుంకాలను ప్రతిపాదించడం గమనార్హం. అనైతిక వ్యాపార పద్ధతులకు పాల్పడుతున్నాయన్న కారణంతో సెక్షన్ 301ను అనుసరించి యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ 16 దేశాలపై 8 నెలల పాటు నిర్వహించిన దర్యాప్తు అనంతరం ఈ టారిఫ్‌లను ప్రతిపాదించారు.

ఇందులో భారత్, చైనా, బంగ్లాదేశ్, కంబోడియా, ఈయూ, ఇండోనేషియా, జపాన్, దక్షిణ కొరియా, మలేసియా, సింగపూర్, స్విట్జర్లాండ్, తైవాన్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలు ఉన్నాయి. ఈ జాబితా నుంచి మెక్సికో, నార్వేను మినహాయించారు. తయారీ రంగంలో ఆయా వాణిజ్య భాగస్వాములు డిమాండ్‌కు మించి తయారీని, ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయని అమెరికాకు చెందిన సీనియర్ అధికారి పేర్కొన్నారు. దీనివల్ల అమెరికా కంపెనీలతో పోలిస్తే ఆయా కంపెనీలకు ధరల విషయంలో ఎడ్జ్ లభిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది. ముఖ్యంగా చైనా తక్కువ ధరలకు భారీగా వస్తువులను తయారు చేసి అంతర్జాతీయ మార్కెట్లలోకి పంపుతోందని పేర్కొంటోంది. ఈ క్రమంలోనే చైనాపై అదనపు సుంకాన్ని ప్రతిపాదించింది. వాషింగ్టన్‌తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని గౌరవించడంలో విఫలమైతే చైనాపై అదనంగా 20 శాతం సుంకం విధించాలని, గరిష్ఠంగా 40 శాతానికి చేర్చాలని ట్రంప్ యంత్రాంగం తాజా ప్రతిపాదనల్లో పేర్కొంది.

మరోవైపు వియత్నాంపై 35 శాతం, భారత్ సహా ఇతర దేశాలపై 25 శాతం వరకు సుంకాలు విధించాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది. ప్రస్తుతం భారత్, వియత్నాం మాత్రమే వాషింగ్టన్‌తో ఇంకా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేదు. తాజా టారిఫ్ ప్రతిపాదనల ద్వారా వాణిజ్య ఒప్పంద చర్చల్లో పైచేయి సాధించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏయే దేశాలపై ఎంతెంత టారిఫ్‌లు విధించేది యూఎస్ ఫెడరల్ రిజిస్టర్ నోటీసులో వెల్లడిస్తుంది.

బంగారు గనిలో 29 మంది కార్మికులు గల్లంతు



జకార్తా: బంగారం కోసం అక్రమ గనిలోకి వెళ్లిన 29 మంది కార్మికులు గల్లంతయ్యారు. ఇండోనేషియాలోని పశ్చిమ జావా ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షాల కారణంగా సమీపంలోని సిసెరు నది పొంగిపొర్లింది. దీంతో వరద నీరు గనిలోకి చేరి, బయటకు వెళ్లే మార్గాన్ని మూసివేసింది. ఈ క్రమంలో గనిలో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారు. ఈ గని ఇండోనేషియా రాజధాని జకార్తాకు దక్షిణంగా ఉన్న పర్వత ప్రాంతంలో ఉంది. సుమారు 100 అడుగుల లోతులో ఈ గని ఉన్నట్లు సమాచారం. ఇండోనేషియాలో ఇలాంటి అక్రమ గనులు అనేకం ఉన్నాయి. ఉపాధి కోసం వేలాది మంది కార్మికులు ఎలాంటి భద్రతా సదుపాయాలు లేని పాత గనుల్లో బంగారం వెలికితీస్తుంటారు. ఇలాంటి గనుల్లో పనిచేసే కార్మికులకు అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదలు రావడం, సొరంగాలు కూలిపోవడం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. అంతేకాకుండా

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE | సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

పాకిస్థాన్‌లో ప్రావిన్సుల విభజన..

రాజకీయ ప్రకంపనలు!

కొత్త పరిపాలనా యూనిట్ల ప్రతిపాదనతో సింధ్‌లో వ్యతిరేకత..

ప్రాంతీయ గుర్తింపు, అధికార పంపిణీ, రాజ్యాంగ ప్రక్రియపై ముదురుతున్న చర్చ



పాకిస్థాన్‌లో ప్రస్తుత నాలుగు ప్రావిన్సులను విభజించి మరిన్ని పరిపాలనా ప్రాంతాలు లేదా ప్రావిన్సులు ఏర్పాటు చేయాలన్న చర్చ దేశ రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరతీసింది. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, పాలనా సామర్థ్యాన్ని పెంచడం, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించడం వంటి కారణాలతో చిన్న ప్రావిన్సుల ఏర్పాటుపై కేంద్ర స్థాయిలో ప్రతిపాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆలోచన ముఖ్యంగా సింధ్ ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ప్రావిన్సుల భౌగోళిక విభజన కేవలం పరిపాలనా మార్పు మాత్రమేనా? లేక రాజకీయ అధికార సమీకరణాలను మార్చే ప్రయత్నమా? అన్న ప్రశ్నలు పాకిస్థాన్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

నాలుగు ప్రావిన్సుల నుంచి మరిన్ని యూనిట్ల వైపు? : ప్రస్తుతం పాకిస్థాన్‌లో పంజాబ్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ అనే నాలుగు ప్రధాన ప్రావిన్సులు ఉన్నాయి. దేశ జనాభా, భౌగోళిక విస్తీర్ణం, పరిపాలనా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరిన్ని చిన్న ప్రావిన్సులు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు గత కొంతకాలంగా రాజకీయ చర్చల్లో ఉన్నాయి. కొందరు నేతలు దేశాన్ని 12 నుంచి 15 పరిపాలనా యూనిట్లుగా విభజించే ఆలోచనను ప్రస్తావించారు. చిన్న ప్రాంతాలుగా విభజిస్తే పాలనా వ్యవస్థ ప్రజలకు చేరువవుతుందని, స్థానిక సమస్యలకు వేగంగా పరిష్కారాలు లభిస్తాయని ప్రతిపాదనకు మద్దతు పలికే వర్గాలు వాదిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు కొత్త ప్రావిన్సుల ఏర్పాటుపై తుది నిర్ణయం, అధికారిక సమగ్ర ప్రణాళిక వెలువడలేదు.

సింధ్ విభజనపై తీవ్ర అభ్యంతరాలు : కొత్త ప్రావిన్సుల ఏర్పాటు చర్చ సింధ్‌లో రాజకీయ ఉద్రిక్తతలకు కారణమవుతోంది. సింధ్ ప్రాంతీయ గుర్తింపు, రాజకీయ అధికారాలు, భౌగోళిక సమగ్రత దెబ్బతింటాయన్న ఆందోళనతో ప్రాంతీయ జాతీయవాద పార్టీలు, నేతలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. సింధ్ ప్రావిన్స్‌ను విభజించే ఏ ప్రయత్నాన్నైనా ప్రజల సమ్మతి లేకుండా చేపట్టకూడదన్నది వారి ప్రధాన వాదన.

సింధ్ అసెంబ్లీ కూడా ప్రావిన్స్ విభజనను వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రావిన్సుల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ చర్చలు, రాజకీయ ప్రకటనలు ప్రాంతీయ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతను పెంచుతున్నాయి.

ప్రజాభిప్రాయ సేకరణపై రాజకీయ విభేదాలు : కొత్త ప్రావిన్సుల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్న ఆలోచన కూడా వివాదానికి దారితీసింది. కేంద్రంలోని కొందరు నేతలు ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు రెఫరెండం నిర్వహించే అవకాశాన్ని ప్రస్తావిస్తున్నారు. అయితే సింధ్‌ను పాలిస్తున్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఈ విధానాన్ని వ్యతిరేకిస్తోంది. ప్రావిన్సుల సరిహద్దులను మార్చే అంశంలో రాజ్యాంగ ప్రక్రియను అనుసరించాల్సిందేనని, రాజకీయ ఏకాభిప్రాయం కీలకమని ఆ పార్టీ వాదిస్తోంది.

పాకిస్థాన్ రాజ్యాంగం ప్రకారం ప్రావిన్సుల సరిహద్దుల్లో మార్పులు చేయాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణకు అవసరమైన మెజారిటీతో పాటు సంబంధిత ప్రావిన్స్ అసెంబ్లీ ఆమోదం కూడా కీలకం. అందువల్ల ఈ అంశం కేవలం రాజకీయ ప్రకటనలతో పరిష్కారమయ్యే వ్యవహారం కాదు.

అధికార కేంద్రీకరణపై అనుమానాలు : కొత్త ప్రావిన్సుల ఏర్పాటును పరిపాలనా సంస్కరణగా ప్రభుత్వం లేదా మద్దతుదారులు అభివర్ణిస్తున్నప్పటికీ, విమర్శకులు మాత్రం దీనిని కేంద్ర అధికార కేంద్రీకరణకు సంబంధించిన అంశంగా చూస్తున్నారు. చిన్న ప్రావిన్సుల ఏర్పాటుతో స్థానిక పాలన మెరుగుపడుతుందా? లేక ప్రాంతీయ రాజకీయ శక్తులను విభజించి కేంద్ర ప్రభావాన్ని పెంచే అవకాశముందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పాకిస్థాన్‌లో కేంద్ర ప్రభుత్వంతో పాటు సైనిక వ్యవస్థ ప్రభావం, ప్రావిన్సుల స్వయం ప్రతిపత్తి, రాజకీయ అధికారాల పంపిణీ వంటి అంశాలు చాలాకాలంగా చర్చలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ప్రావిన్సుల ప్రతిపాదనకు రాజకీయ, రాజ్యాంగ, ప్రాంతీయ గుర్తింపు అంశాలు కూడా ముడిపడుతున్నాయి. పరిపాలనా మార్పుల వెనుక ఉద్దేశం ఏదైనా, వాటిని ప్రజాస్వామ్య సమ్మతి, రాజ్యాంగబద్ధత, సమాన వనరుల పంపిణీ ఆధారంగా చేపట్టాలన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

విభజనతోనే అభివృద్ధి సాధ్యమా? : చిన్న పరిపాలనా యూనిట్లు ఏర్పడితే పాలనా సామర్థ్యం పెరుగుతుందనే వాదనకు మరోవైపు ఆర్థిక వ్యయాలు, కొత్త ప్రభుత్వ వ్యవస్థల నిర్మాణం, వనరుల పంపిణీ, నీటి హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రావిన్సులు ఏర్పాటు చేయడం అంటే కొత్త పరిపాలనా కార్యాలయాలు, ప్రభుత్వ యంత్రాంగం, బడ్జెట్, మౌలిక సదుపాయాలు అవసరమవుతాయి. ఇవన్నీ ఆర్థికంగా భరించగలిగే పరిస్థితి ఉందా? కొత్త యూనిట్లు స్వయం సమృద్ధి సాధించగలవా? అన్న అంశాలపై స్పష్టమైన సమాధానాలు అవసరం.

పాకిస్థాన్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, పరిపాలనా సవాళ్ల మధ్య కొత్త ప్రావిన్సుల ఏర్పాటు చర్చ దేశ సమాఖ్య వ్యవస్థకు కీలక పరీక్షగా మారుతోంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలనా సంస్కరణలు చేపట్టడం అవసరమే అయినా, ప్రాంతీయ గుర్తింపులను గౌరవించడం, ప్రజల సమ్మతిని పొందడం, రాజ్యాంగ ప్రక్రియను అనుసరించడం అంతకంటే ముఖ్యం. విభజనతో పరిపాలన మెరుగుపడుతుందా? లేక కొత్త రాజకీయ విభేదాలకు దారితీస్తుందా? అన్నది పాకిస్థాన్ భవిష్యత్ రాజకీయ పరిణామాలే నిర్ణయించనున్నాయి.

బాల్యం బలహీనమైతే..

భవిష్యత్తు ఎలా బలపడుతుంది?

- **చిన్నారుల్లో రక్తహీనత.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం!**
- **ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ సాంపదా సర్వేలో ఆందోళనకర గణాంకాలు**
- **12-59 నెలల పిల్లల్లో 57.5 శాతం మందికి రక్తహీనత.. మహిళల్లోనూ అధిక ప్రభావం**
- **చిన్నారుల ఆరోగ్యంపై పోషకాహార లోపం తీవ్ర ప్రభావం.. సమగ్ర చర్యలు అవసరం**



ఆంధ్రప్రదేశ్‌లో చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) నిర్వహించిన తాజా సర్వే ఆందోళనకర అంశాలను వెలుగులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా చిన్నారుల్లో రక్తహీనత సమస్య ఉన్నప్పటికీ, 12 నుంచి 59 నెలల వయస్సున్న పిల్లల్లో రక్తహీనత ప్రాబల్యం అత్యధికంగా నమోదైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. పోషకాహార లోపం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సంరక్షణలో లోపాలు చిన్నారుల ఎదుగుదలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం మరోసారి గుర్తుచేస్తోంది.

ఏపీలోనే అత్యధిక రక్తహీనత : ఐసీఎంఆర్ నిర్వహించిన సాంపదా 2023-2025 జాతీయ పోషకాహార సర్వే ప్రకారం, దేశవ్యాప్తంగా 12--59 నెలల వయస్సున్న చిన్నారుల్లో 41.8 శాతం మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంఖ్య 57.5 శాతంగా నమోదైంది. జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో రక్తహీనత సమస్య తీవ్రంగా ఉన్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ తర్వాత గుజరాత్ 56.5 శాతం, ఛత్తీస్‌గఢ్ 55.6 శాతంతో అధిక రక్తహీనత నమోదైన రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి.

రక్తహీనత చిన్నారుల శారీరక ఎదుగుదలకే కాకుండా, మెదడు అభివృద్ధి, నేర్చుకునే సామర్థ్యం, రోగనిరోధక శక్తిపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. బాల్యంలో ఎదురయ్యే పోషకాహార లోపాలు భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశమున్నందున, ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం తగదు.

చిన్నారుల పరిస్థితితో పాటు మహిళల్లో రక్తహీనత సమస్య కూడా రాష్ట్రంలో తీవ్రంగా ఉన్నట్లు సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పునరుత్పత్తి వయస్సు మహిళల్లో దేశవ్యాప్తంగా రక్తహీనత ప్రాబల్యం 56 శాతంగా ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 68.5 శాతంగా నమోదైంది. ముఖ్యంగా గర్భిణులు, బాలికలు, మహిళలకు పోషకాహారం అందించడం, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన చికిత్స అందించడం అత్యంత కీలకం.

పాఠశాల వయస్సు పిల్లల్లోనూ సమస్య : 5 నుంచి 9 సంవత్సరాల వయస్సున్న పిల్లల్లో దేశవ్యాప్తంగా 31.3 శాతం మందికి రక్తహీనత ఉన్నట్లు సర్వే వెల్లడించింది. ఈ వయస్సులో పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతున్న దశలో ఉండటంతో రక్తహీనత వారి విద్యా సామర్థ్యం, చురుకుదనం, ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. చిన్నారుల నుంచి పాఠశాల వయస్సు పిల్లల వరకు పోషకాహార లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం సూచిస్తోంది.

ఇనుము లోపమే ఒక్క కారణం కాదు : రక్తహీనతకు ఇనుము లోపం ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, అన్ని సందర్భాల్లో అదే కారణమని భావించకూడదని సర్వే స్పష్టం చేస్తోంది. ఇనుము లోపం, ఇన్‌ఫెక్షన్లు, హిమోగ్లోబిన్‌కు సంబంధించిన జన్యుపరమైన సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో సంబంధం ఉన్న వాపు వంటి అంశాలు కూడా రక్తహీనతకు కారణమవుతాయి. మహిళలు, బాలికలు, చిన్నారుల్లో రక్తహీనత కేసుల్లో సుమారు సగం వరకు ఇనుము లోపంతో సంబంధం ఉన్నట్లు అధ్యయనం వెల్లడించింది. అందువల్ల లక్షణాల ఆధారంగా మాత్రమే కాకుండా, అవసరమైన వైద్య పరీక్షల ద్వారా కారణాన్ని గుర్తించి చికిత్స అందించడం ముఖ్యం.

పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వ పథకాల అమలుతో పాటు కుటుంబ స్థాయిలోనూ ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరం. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పోషక విలువలున్న ఆహార పదార్థాలు, తగినంత ప్రోటీన్లు, విటమిన్లు కలిగిన ఆహారం అందించడం ద్వారా పిల్లల పోషక స్థితిని మెరుగుపరచవచ్చు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా పోషకాహార అవగాహన, ఆరోగ్య పరీక్షలు, అవసరమైన చికిత్సలను సమన్వయంతో అమలు చేయాలి.

రక్తహీనతను కేవలం వైద్య సమస్యగా కాకుండా, బాలల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంతో ముడిపడిన అంశంగా చూడాలి. చిన్నారుల ఆరోగ్యంపై పెట్టే శ్రద్ధ దేశ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడిగా భావించాలి. ఆంధ్రప్రదేశ్‌లో రక్తహీనత ప్రాబల్యం అధికంగా నమోదైన నేపథ్యంలో, ఈ సమస్యను తగ్గించేందుకు నిరంతర పర్యవేక్షణ, లక్ష్యిత పోషకాహార కార్యక్రమాలు, కుటుంబాలకు అవగాహన కల్పించడం అత్యవసరం.

బస్సులు ఆపరా.. ప్రజల ప్రాణాలు పట్టవా?

ప్రజా రవాణాలో మానవత్వం మృగ్యమా!



ప్రజా రవాణా వ్యవస్థ అంటే సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు.. అత్యవసర సమయాల్లో వారి అవసరాలకు స్పందించడం కూడా. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులే ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు. వైద్య చికిత్స కోసం పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సిన రోగులకు బస్సు సేవలు ఎంతో కీలకం. అలాంటి అత్యవసర సమయంలో బస్సు ఆపకుండా వెళ్లిపోతే బాధితులు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కాశీపురం సమీపంలో సంజీవమెట్ట వద్ద చోటుచేసుకున్న ఘటన ప్రజా రవాణా వ్యవస్థ బాధ్యతారాహిత్యంపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.

విశాఖపట్నం ఆసుపత్రికి ఓ రోగిని తరలించేందుకు గురువారం సంజీవమెట్ట వద్ద 12డి నంబరు ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించినప్పటికీ డ్రైవర్ బస్సును నిలపకుండా వెళ్లిపోయాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామంతో రోగిని ఆసుపత్రికి తీసుకెళ్లడంలో జాప్యం జరిగిందని, ఆలస్యం కారణంగానే సదరు వ్యక్తి గుండెపోటుతో మరణించాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి చేర్చాల్సిన ఆతృత.. మరోవైపు బస్సు ఆగకపోవడంతో ఎదురైన నిస్సహాయత.. చివరకు ప్రాణం కోల్పోయిన విషాదం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

అత్యవసర సమయంలోనూ కనికరం లేదా? : ప్రతి నిమిషం విలువైన వైద్య అత్యవసర పరిస్థితుల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంబులెన్స్‌లు వెంటనే అందుబాటులోకి రాని సందర్భాల్లో ప్రజలు ఆర్టీసీ బస్సులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఉంటాయి. అలాంటి సమయంలో ప్రయాణికుల అవసరాలను గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించాల్సిన బాధ్యత ప్రజా రవాణా సిబ్బందిపై ఉంటుంది. అయితే సంజీవమెట్ట వద్ద రోగిని తీసుకెళ్లేందుకు బస్సును ఆపినా నిలపకుండా వెళ్లిపోయారన్న ఆరోపణలు నిజమైతే, అది విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యమే అవుతుంది.

బస్సు నిలిపి ఉంటే రోగిని సకాలంలో ఆసుపత్రికి తరలించే అవకాశం ఉండేదా? డ్రైవర్ ఎందుకు బస్సును ఆపలేదు? ప్రయాణికులు, స్థానికులు చేసిన విజ్ఞప్తిని పట్టించుకోలేదా? అత్యవసర పరిస్థితిని డ్రైవర్ గుర్తించగలిగే పరిస్థితి ఉందా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. అయితే వ్యక్తి మరణానికి బస్సు ఆగకపోవడమే కారణమని వైద్యపరమైన నిర్ధారణ లేకుండా తేల్చడం సరికాదు. గుండెపోటుకు సంబంధించిన వైద్య వివరాలు, చికిత్సకు జరిగిన జాప్యం, ఇతర పరిస్థితులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. అదే సమయంలో గ్రామస్థులు చేసిన ఆరోపణలను కూడా అధికారులు తీవ్రంగా పరిగణించాలి.

బస్సులు నిలపరంటూ గ్రామస్థుల ఆగ్రహం : ఈ ఘటన ఒక్క వ్యక్తి మృతితో ముగిసిపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సక్రమంగా నిలపడం లేదన్న అసంతృప్తి మరోసారి బయటపడింది. కాశీపురం, సంజీవమెట్ట పరిసర ప్రాంతాల ప్రయాణికులు, గ్రామస్థులు బస్సుల నిలుపుదల సమస్యపై ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. దేవరాపల్లి నుంచి విశాఖపట్నం, అనకాపల్లితో పాటు ఇతర డిపోలకు చెందిన బస్సులను కూడా జంక్షన్‌లో తప్పనిసరిగా నిలపాలని డిమాండ్ చేశారు.

బస్సులు నిర్దిష్ట ప్రాంతాల్లో నిలపకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికుల ఆవేదన. గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సేవలు సక్రమంగా లేకపోతే ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా అత్యవసర సమయాల్లో మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. ప్రజల అవసరాలను గుర్తించి బస్సుల నిలుపుదలపై స్పష్టమైన విధానం అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డిపో మేనేజర్ల ఆదేశాలకే విలువ లేదా? : ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన ఆరోపణ ఏమిటంటే.. డిపో మేనేజర్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది డ్రైవర్లు వాటిని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే నిజమైతే ఆర్టీసీ పరిపాలనా వ్యవస్థ పనితీరుపై కూడా ప్రశ్నలు తలెత్తడం సహజం. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడం ఒక ఎత్తయితే, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయించడం మరో ఎత్తు. ఆదేశాలు కాగితాలకే పరిమితమైతే ప్రజలకు ప్రయోజనం ఏముంటుంది?

డిపో మేనేజర్లు ఇచ్చిన ఆదేశాలు అమలవుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలి. ఏయే బస్సులు ఏయే ప్రాంతాల్లో నిలపాలి? నిర్దిష్ట స్టేజీల్లో బస్సులు నిలపకుండా వెళ్లిపోతున్నాయా? ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలి. నిబంధనలను ఉల్లంఘించే సిబ్బందిపై విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

ప్రజా రవాణాలో మానవత్వం కూడా ఉండాలి : ఆర్టీసీ బస్సులు కేవలం ఆదాయం, ఆక్యుపెన్సీ, సమయపాలన వంటి అంశాలకే పరిమితం కాకూడదు. ప్రజల అవసరాలు, ముఖ్యంగా గ్రామీణ ప్రయాణికుల ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బస్సు ఆపడం వల్ల కొన్ని నిమిషాల ఆలస్యం కావచ్చు. కానీ అత్యవసర పరిస్థితిలో ప్రయాణికుడికి ఆ అవకాశం ఎంతో విలువైనదిగా మారవచ్చు. దీనర్థం ప్రతి సందర్భంలోనూ భద్రతా నిబంధనలను పక్కనపెట్టి బస్సులు నిలపాలని కాదు. నిర్దిష్ట స్టేజీల్లో బస్సులను తప్పనిసరిగా ఆపడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో నిబంధనలకు అనుగుణంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల నిలుపుదల సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ప్రయాణికుల సంఖ్య, ఆసుపత్రులకు వెళ్లే వారి అవసరాలు, విద్యార్థులు, ఉద్యోగుల రాకపోకలను పరిగణనలోకి తీసుకుని బస్సుల స్టాపింగ్ పాయింట్లను సమీక్షించాలి. అవసరమైన చోట అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలి.

బాధిత కుటుంబానికి న్యాయం.. ఘటనపై సమగ్ర విచారణ : సంజీవమెట్ట వద్ద జరిగిన ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. 12డి బస్సు ప్రయాణ వివరాలు, సంబంధిత సిబ్బంది వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న సీసీటీవీ లేదా ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించాలి. బస్సు ఎందుకు నిలపలేదు? డ్రైవర్‌కు రోగి పరిస్థితి గురించి సమాచారం అందిందా? డిపో మేనేజర్ల ఆదేశాలు ఉన్నాయా? ఉంటే వాటిని ఎందుకు అమలు చేయలేదు? అనే అంశాలపై నిష్పాక్షిక విచారణ జరగాలి. అదే విధంగా మృతుడి కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలవాలి. ఘటనకు సంబంధించిన వాస్తవాలు, బాధ్యతలపై విచారణ జరిపి, చట్టపరంగా పరిహారం లేదా ఇతర సహాయం అందించాల్సిన అర్హత ఉంటే తగిన చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాన్ని అధికారుల చుట్టూ తిప్పకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.

ఆర్టీసీ సేవలు ప్రజలకు భరోసా కల్పించాలి : ప్రజా రవాణా వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలంటే బస్సులు సమయానికి రావడం, నిర్దిష్ట స్టేజీల్లో ఆగడం, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం తప్పనిసరి. గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల నిలుపుదల సమస్యను చిన్న విషయంగా చూడకూడదు. ఒక గ్రామానికి బస్సు ఆగకపోవడం అంటే అక్కడి ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇతర అవసరాలకు సంబంధించిన అవకాశాలు దూరమవడం కూడా.

అనకాపల్లి జిల్లా కాశీపురం సమీపంలోని సంజీవమెట్ట ఘటన ఆర్టీసీ యాజమాన్యానికి ఒక హెచ్చరికగా నిలవాలి. ఈ ఘటనలో అసలు వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల నిలుపుదలపై సమగ్ర సమీక్ష జరగాలి. ప్రతి డిపోలో ఇచ్చే ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి.

ప్రజల కోసం నడిచే బస్సులు ప్రజల అవసరాలకు స్పందించాలి. ప్రయాణికుల ప్రాణాలు, వారి అత్యవసర పరిస్థితులు, గ్రామీణ ప్రాంతాల సమస్యలు ఆర్టీసీకి ప్రాధాన్య అంశాలు కావాలి. బస్సు ఆగకపోవడంపై వచ్చిన ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాలి. ఒక కుటుంబంలో చోటుచేసుకున్న విషాదం మరో కుటుంబానికి ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా రవాణా వ్యవస్థలో సమయపాలనతోపాటు మానవత్వం, జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యమని ఆర్టీసీ యాజమాన్యం గుర్తించాలి.

సంక్షేమ పథకాలే అజెండాగా.. ప్రజల్లోకి సీతక్క!

- ములుగు నియోజకవర్గంలో మంత్రి విస్తృత పర్యటనలు
- ప్రభుత్వ పథకాలపై గ్రామగ్రామాన అవగాహన.. ప్రజలతో మమేకం
- ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ బీమా, రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



ములుగు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ధ్యేయంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ములుగు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచే ప్రయత్నం చేస్తున్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, రైతాంగానికి అండగా నిలవడం లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని మంత్రి వివిధ సమావేశాల్లో వివరిస్తున్నారు. ఈ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలంటే క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమని భావిస్తూ గ్రామగ్రామాన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఇందిరమ్మ బీమాతో కుటుంబాలకు భరోసా

కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి ప్రజలకు వివరిస్తున్నారు. ఇందిరమ్మ బీమా పథకం ఉద్దేశం, అర్హతలు, ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆపద సమయంలో పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నదే సంక్షేమ పాలన లక్ష్యమని చెబుతున్నారు.

సొంతింటి కల సాకారం దిశగా ఇందిరమ్మ ఇళ్లు

సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ వసతి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని వివరిస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇళ్ల నిర్మాణంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తోందని సమావేశాల్లో పేర్కొంటున్నారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేస్తున్నారు.

రైతాంగానికి అండగా.. రుణమాఫీ, రైతు బీమా

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను కూడా మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాల ద్వారా రైతు కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతు కష్టాన్ని గుర్తించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తోందని చెబుతున్నారు.

గ్రామస్థాయి సమావేశాలే వేదికగా సంక్షేమ ప్రచారం

కేవలం ప్రభుత్వ పథకాలను ప్రకటించడమే కాకుండా వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరేలా చేయడమే లక్ష్యంగా సీతక్క పర్యటనలు కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో సమావేశమవుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలపై అవగాహన లేక ప్రయోజనాలు పొందలేని కుటుంబాలకు సమాచారం చేరవేయాలని స్థానిక నాయకులకు సూచిస్తున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా కృషి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రజలకు చేరువగా.. ప్రభుత్వానికి వారధిగా!

ములుగు నియోజకవర్గం గిరిజన, గ్రామీణ ప్రాంతాలతో విస్తరించి ఉండటంతో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం మరింత అవసరమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క గ్రామీణ ప్రాంతాల పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు.మొత్తానికి ములుగు నియోజకవర్గంలో సీతక్క పర్యటనలు రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ప్రజా సమస్యల గుర్తింపు, లబ్ధిదారులకు అవగాహన కల్పించే దిశగా సాగుతున్నాయి. అయితే ఈ పర్యటనల అసలైన ఫలితం పథకాలపై ప్రసంగాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు అందినప్పుడే కనిపించనుంది.

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాల అమలు ఎంత సమర్థవంతంగా జరుగుతుందన్నదే ఇప్పుడు కీలకం.

మైసమ్మ సన్నిధిలో కార్తీక బ్రహ్మోత్సవ వైభవం

- ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి,కూచకుళ్ల
- అమ్మవారికి విశేష క్షీరాభిషేకం..
- ప్రత్యేక అలంకరణ,కుంభ హారతితో ఆధ్యాత్మిక శోభ
- ముఖ్య అతిథులకు ఘనంగా సన్మానం..
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు





కడ్తాల్, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి శ్రీ మైసమ్మ దేవత ఆలయంలో కార్తీక మాస బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి.అమ్మవారి నామస్మరణలు, మంగళ వాయిద్యాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఎమ్మెల్సీ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు

బ్రహ్మోత్సవాల తొలిరోజు ఆలయ ట్రస్టీ కుటుంబీకులు ఆర్వీ జ్యోతి – అరుణ్ దంపతులు,కడ్తాల్ చాట్ల లింగప్ప కుటుంబం సంయుక్తంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించారు.అనంతరం వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి,అమ్మవారిని అత్యంత సుందరంగా విశేష అలంకరణ చేశారు.పుష్పాలతో అలంకరించిన అమ్మవారి దివ్యమంగళ స్వరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.అనంతరం సంప్రదాయబద్ధంగా కుంభ హారతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయానికి తరలివచ్చిన భక్తులు

కార్తీక మాసం పవిత్రతను పురస్కరించుకుని ప్రారంభమైన బ్రహ్మోత్సవాలతో మైసిగండి ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చారు.ప్రత్యేక పూజలు,అభిషేకాలు,హారతి కార్యక్రమాల్లో భక్తులు భక్తిపూర్వకంగా పాల్గొన్నారు.అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు.

ముఖ్య అతిథులకు ఘన సన్మానం

బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి,కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి లను ఆలయ ఈఓ వీరేశం,ఫౌండర్ ట్రస్టీ లక్ష్మీ శిరోలి, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించారు.శాలువాలు కప్పి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆధ్యాత్మిక వైభవానికి వేదికగా బ్రహ్మోత్సవాలు కార్తీక మాసంలో నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడంతో పాటు ఆలయ సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలను చాటిచెప్పేలా సాగుతు న్నాయి. తొలి రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభం కావడంతో రానున్న ఉత్సవ కార్యక్రమాలపై భక్తుల్లో ఆసక్తి నెలకొంది. ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు యాదగిరి అర్చకులు సంతోష్ శర్మ,ఆనంద్,వెంకటరమణ,విజయ్ కుమార్, సిబ్బంది చంద్రయ్య,రాములు,శ్రీనివాసులు,వెంకటేష్,సత్యం కృష్ణ, రామకృష్ణ శివరాంలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌తో స్థానికుల్లో భయాందోళనలు.. భద్రతా చర్యలు చేపట్టాలి



మణికొండ, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్, నెక్నంపూర్ డివిజన్ అలకాపూర్ రోడ్ నెంబర్ 13లో ఈ.ఏ.పీ.ఎల్, ల్యాంసమ్ బిల్డర్స్ చేపట్టిన నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగా నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌తో స్థానిక నివాసితులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నిర్మాణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బ్లాస్టింగ్ చేపట్టే ముందు స్థానిక నివాసితులకు ముందస్తు సమాచారం అందించాలని బిల్డర్లకు సూచించారు. చుట్టుపక్కల భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం కలగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ప్రకంపనలు తగ్గించేలా నియంత్రిత బ్లాస్టింగ్ పద్ధతులను మాత్రమే అవలంబించాలని కోరారు. బ్లాస్టింగ్ కారణంగా సమీప భవనాలకు నష్టం వాటిల్లితే నష్టాన్ని అంచనా వేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా బిల్డర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర గనులు, భూగర్భ శాస్త్ర శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణ ప్రాంతాన్ని తనిఖీ చేయాలని, బ్లాస్టింగ్‌కు సంబంధించిన అనుమతులు, భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నివాసితుల ప్రాణాలకు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, గౌరుకంటి విఠల్, షేక్ ఆరిఫ్, మాల్యాద్రి నాయుడు, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, దేవి ప్రియ, యాలాల కిరణ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం చలో ఢిల్లీ

- ఆందోళనను విజయవంతం చేయాలి
- హమాలి సంఘం రాష్ట్ర సభ్యుడు పల్లెపాక వీరయ్య పిలుపు



కడ్తాల్, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ హమాలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు,అధ్యక్షుడు పల్లెపాక వీరయ్య పిలుపునిచ్చారు.మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో నిర్వహించిన తెలంగాణ ఆల్ హమాలి సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు గతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి,వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మిక వర్గానికి నష్టం కలిగించే చర్యగా అభివర్ణించారు.కార్మికుల హక్కులు,ఉద్యోగ భద్రత,సంక్షేమం,పని పరిస్థితుల పరిరక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న ధర్నాలో హమాలి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా హమాలి యూనియన్ కోశాధికారి జే.పెంటయ్య,కడ్తాల్ మండల అధ్యక్షుడు వి.రమేష్,మండల కమిటీ సభ్యులు ఎస్.రమేష్,కృష్ణ,శ్రీను,వెంకటయ్య,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మద్దిమడుగులో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

- నవంబర్ 26న గిరిజన లంబాడీలంతా స్వచ్ఛందంగా తరలిరావాలి
- మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ పిలుపు
- గిరిజనుల ఆరాధ్య దైవానికి నల్లమల నడిబొడ్డున సముచిత గౌరవం



ఆమనగల్ నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : గిరిజన లంబాడీల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ భూమిపూజ కార్యక్రమాన్ని ఈ నెల 26న పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ తెలిపారు.సుమారు 20 ఎకరాల విశాలమైన ప్రదేశంలో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి ప్రతి గిరిజన లంబాడీ బిడ్డ స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ భూమిపూజకు నల్లమల అటవీ ప్రాంతంలోని మద్దిమడుగును ఎంపిక చేయడం గిరిజన సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.గిరిజనులు అధికంగా నివసించే తండాలు,గూడాలకు అందుబాటులో ఉండే పవిత్ర ప్రదేశంలో విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.గిరిజనులకు రాజకీయ,సామాజిక గుర్తింపు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీకి చారిత్రక పాత్ర ఉందని,ఇందిరాగాంధీ హయాంలో కల్పించిన రిజర్వేషన్ల ఫలితంగానే నేడు గిరిజనులు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పత్య నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్ నాయక్,గిరిజన నాయకులు బిచ్య నాయక్,మాజీ ఎంపీపీ అనిత విజయ్ నాయక్,సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్,ఉపసర్పంచ్ సురేష్ నాయక్,సింగిల్ విండో డైరెక్టర్లు ఆనంద్ కుమార్,కిషన్ నాయక్,ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణ నాయక్,మాజీ సర్పంచ్ పంతు నాయక్,రాగ్య నాయక్,మల్లేష్ నాయక్,శ్రీను నాయక్,శ్రీధర్ నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

- నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు నమోదు ప్రక్రియ
- అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి
- కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



కందుకూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కోసం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు ఓటరు నమోదు, క్లెయిమ్స్,అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ కొనసాగ నుంది.ఈ మేరకు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఐటీ సంస్థలు, ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాల యాల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు,జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్,జల్‌పల్లి, సరూర్ నగర్,ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని విద్యాసంస్థలు,కార్యాలయాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పట్టభద్రులకు అవగాహన కల్పించాలి.శిబిరాల నిర్వ హణను పర్య వేక్షిస్తూ నమోదైన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత ఏఈఆర్వోలకు అంద జేయాలని సూచించారు.ముఖ్యంగా ఉపాధ్యాయులు, ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.కావున అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10లోపు తమ పేర్లను ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కందుకూరు ఆర్డీవో, సంబంధిత ఏఈఆర్వో విజ్ఞప్తి చేశారు.

మెటా కార్యాలయం ఎదుట నిరసనకు యత్నం

- యూత్ కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్ట్



శేర్లింగంపల్లి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : మెటా కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు వచ్చిన తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డితో పాటు మరో 20 మందిని రాయదుర్గం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాయదుర్గంలోని స్ట్రైవ్యూ భవనం వద్దకు చేరుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు మెటా కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అవసరమైన పూచీకత్తులు తీసుకుని అందరినీ బెయిల్‌పై విడుదల చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మార్కెట్లు, వాణిజ్య వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

- 10వ రోజు కార్యక్రమంలో 65 మార్కెట్లు, 108 వాణిజ్య వీధుల శుభ్రత



శేర్లింగంపల్లి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పదో రోజు మంగళవారం మూడు జోన్లలో విస్తృతంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ల పరిధిలోని మార్కెట్లు, వాణిజ్య వీధులు, దుకాణ సముదాయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 65 మార్కెట్లు, 108 వాణిజ్య వీధులు, ఐదు దుకాణ సముదాయాలను శుభ్రం చేశారు. 1,478 దుకాణాలను తనిఖీ చేయగా, 1,266 దుకాణాల్లో 'చెత్తకుండీ లేకపోతే వ్యాపారం లేదు' విధానాన్ని అమలు చేశారు. పారిశుద్ధ్య నిబంధనలు పాటించని దుకాణాలకు సంబంధించి 42 నోటీసులు జారీ చేశారు.ప్రతి దుకాణంలో తప్పనిసరిగా చెత్తకుండీలు ఏర్పాటు చేసుకోవాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశిత పద్ధతిలో పారవేయాలని వ్యాపారులకు అధికారులు సూచించారు. మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు వ్యాపారులు, దుకాణదారులు సహకరించాలని కోరారు.పరిశుభ్రమైన సైబరాబాద్ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగిస్తామని, చెత్త నిర్వహణ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని సీఎంసీ అధికారులు స్పష్టం చేశారు.

మైసిగండి శివాలయంలో కార్తీక పౌర్ణమి ప్రత్యేక అభిషేకాలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ



కడ్తాల్, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని శ్రీ శివాలయం,రామాలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం ప్రత్యేక అభిషేకాలు,పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగగా,భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నరసింహ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ ముదిరాజ్,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నేనావత్ భిక్య నాయక్,అమనగల్ సింగిల్ విండో డైరెక్టర్ నేనావత్ రాజు,మాజీ సర్పంచ్ సబావత్ రాములు నాయక్,మునావత్ రాజు,సబావత్ రాజేందర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



మణికొండ, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మణికొండలోని లాంకో హిల్స్ సమీపంలో ఉన్న శ్రీ ఎల్లమ్మ ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలంతా కలిసి సామూహిక భోజనాల్లో పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు మహిళల మధ్య ఐక్యత, ఆత్మీయతను చాటిచెప్పేలా కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీశ్రీ, షకీలా రెడ్డి, బిందు, ప్రభావతి తదితరులతో పాటు మణికొండకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి కేసు విజయవంతం..
- బాధితురాలికి రూ.22 వేల విలువైన వైద్య సేవలు ఉచితం



భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్(పి ఎం రాహత్) పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి కేసును విజయవంతంగా అమలు చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాధుల సామ్రాజ్యానికి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సుమారు రూ.22 వేల విలువైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించారు.ఆసుపత్రులు అందించే వైద్య సేవల ఖర్చును టిఎంఎస్ 2.0 పోర్టల్ ద్వారా కలెక్టర్ లాగిన్ నుంచి చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో ప్రమాద బాధితులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా తక్షణ వైద్య చికిత్స పొందేందుకు అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సాధుల సామ్రాజ్యాన్ని భద్రాచలం సీఐ రాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి ఆర్ ఎం బాలాజీ, ఆరోగ్యశ్రీ మిత్ర సుధాకర్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది పరామర్శించారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి సత్వర వైద్యం అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. పీఎం రాహత్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటంతో పాటు, వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, సంబంధిత విభాగాల సమన్వయంతో జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మయూరి నగర్ లో వాసవి క్లబ్ వార్షిక సర్వ సభ్య సమావేశం

శేరిలింగంపల్లి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :



ఆదివారం రోజున క్లబ్ అధ్యక్షులు వెలిచాల సదానందం అధ్యక్షతన మయూరి నగర్ వాసవి క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశము నిర్వహించబడినది. ఈ సమావేశములో క్లబ్ అధ్యక్షులు వెలిచాల సదానందం మాట్లాడుతూ.. క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో మెంబెర్ షిప్ గ్రోత్, కె సి జి ఎఫ్, వి కె ఎస్ పి ఎన్రోల్మెంట్, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ నిర్వహణ, పేర్మినెంట్ ప్రోజెక్టుల నిర్వహణ విజయవంతంగా పూర్తి చేసి క్లబ్ ను జిల్లా లోనే అగ్ర స్థానములో ఉంచుటకై తమ కార్య వర్గం కృషి చేసిందని తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా 44 మంది కొత్త సభ్యులను 18 మంది యూనివర్సల్ మెంబర్షిప్ ను, 18 కె సి జి ఎఫ్ లను, 4 వి కె ఎస్ పి లను చేర్పించామని తెలిపారు. ఈ సంవత్సరము ఇప్పటి వరకు 90 క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ ను మరియు పేర్మినెంట్ ప్రోజెక్టు లో భాగంగా జెడ్ పి హెచ్ ఎస్ హైదర్ నగర్ పాఠశాలలో భాగంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన, పాఠశాలకు 15000 రూపాయల మైక్ సెట్ బహూకరించామని తెలిపారు. క్లబ్ ఆధ్వర్యములో మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, మెరిట్ విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్స్, వృద్ధాశ్రమాలలో గ్రోసరీస్ పంపిణీ, పేద వారికీ గ్రోసరీస్ పంపిణి, జి హెచ్ ఎం సి పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణి, పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతి ప్రధానం మరియు మొక్కలు నాటడం, పరిసరాల కాలుష్యం గూర్చి అవగాహనా కార్యక్రమం, పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఆగష్టు మాసంలో 9 సేవ కార్యక్రమాలతో ఐ ఎన్ పి విసిట్ ను అత్యంత ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం కార్యదర్శి రామమూర్తి కార్యదర్శి నివేదికను, కోశాధికారి బ్రహ్మ ప్రకాష్ ఆర్థిక నివేదికను ప్రవేశ పెట్టారు. సభ్యులు కార్యదర్శి నివేదికపై, ఆర్థిక నివేదికపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. చివరగా 2027 సంవత్సరానికి అధ్యక్షులుగా చిగుళ్ల పల్లి సుభాష్ గుప్తా , కార్యదర్శిగా అడ్డేపల్లి వెంకట బ్రహ్మ ప్రకాష్ , కోశాధికారిగా అనుముల వెంకట నాగ శేషయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని క్లబ్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశములో జిల్లా ఇంచార్జి పచ్చిపులుసు దుర్గ శ్రీనివాస్ రావు , రీజియన్ చైర్పర్సన్ బంగారు తిరపన్న , జోన్ చైర్ పర్సన్ బండి కిరణ్ కుమార్ , క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బచ్చు హరికమల్ , క్లబ్ మాజీ అధ్యక్షులు కాసుల వెంకట నర్సయ్య , క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవతో రూ.2.22 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కేశంపేట, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :



కేశంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంగళవారం మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.2,22 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.చెక్కులు అందుకున్న వారిలో ఆలూరు సరళమ్మ (అల్వాల్), టి. చెన్న కేశవులు (దత్తాయిపల్లి), ఆకె సరిత (ఇప్పలపల్లి), కుమ్మరి ఆంజనేయులు (భైర్ఖాన్‌పల్లి), గంజి లక్ష్మయ్య, జర్పుల రవి (తొమ్మిదిరేకుల), దిద్దెల అంజమ్మ (లేమామిడి), నిర్ధవెల్లి పరుశురాములు (కొత్తపేట) ఉన్నారు.అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, పోమాలపల్లి సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి, భైరఖాన్‌పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్, మాజీ సర్పంచులు శేఖర్ పంతులు, శ్రీశైలం గౌడ్, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్, బాలరాజ్ గౌడ్, కృష్ణయ్య, పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు బోదునాంపల్లి శేఖర్, తొమ్మిదిరేకుల రాంరెడ్డి, ఉపసర్పంచ్ యారం రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, జగన్ రెడ్డి, లక్ష్మయ్య, జగత్ రెడ్డి, నాగరాజు, మురళి, చింటూ, శశి, కిషోర్, చౌలపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్గో టెర్మినల్‌లో అప్‌గ్రేడెడ్ ఎలివేటెడ్ ట్రాన్స్‌ఫర్ వెహికల్ (ఈటీవీ)ఆధారిత నిల్వ వ్యవస్థను అందుబాటులో

రాజేంద్రనగర్, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : జీఎంఆర్ ఏరో ఆధ్వర్యంలోని కన్సార్టియంలో భాగమైన జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్),కార్గో టెర్మినల్‌లో అప్‌గ్రేడెడ్ ఎలివేటెడ్ ట్రాన్స్‌ఫర్ వెహికల్ (ఈటీవీ) ఆధారిత నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తన కార్గో నిర్వహణ మౌలిక సదుపాయాలను



మరింత బలోపేతం చేసింది.ఈ ఆధునికీకరించిన వ్యవస్థ ద్వారా ప్రస్తుత టెర్మినల్ విస్తీర్ణంలోనే నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు,ఉష్ణోగ్రత నియంత్రిత,ప్రత్యేక నిర్వహణ అవసరమైన కార్గోను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాలు మరింత బలోపేతం అయ్యాయి.ఈ అప్‌గ్రేడెడ్ వ్యవస్థతో టెర్మినల్‌లోని యూఎల్‌డీ (యూనిట్ లోడ్ డివైస్) నిల్వ సామర్థ్యం 33 నుంచి 80 యూనిట్లకు పెరిగింది.తద్వారా 140 శాతానికి పైగా సామర్థ్యం వృద్ధి నమోదైంది.నిల్వ సదుపాయాన్ని నిలువుగా విస్తరించడం ద్వారా,భౌతికంగా టెర్మినల్ విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం లేకుండానే అధిక పరిమాణంలో కార్గోను నిల్వ చేసుకునే అవకాశం హైదరాబాద్ విమానాశ్రయ కార్గో టెర్మినల్‌కు లభించింది.ఈ అదనపు సామర్థ్యం ఒకేసారి పలు కార్గో విమానాల కార్యకలాపాలను నిర్వహించేందుకు మరింత వెసులుబాటును కల్పించడంతో పాటు,భవిష్యత్తులో పెరగనున్న కార్గో అవసరాలను తీర్చేందుకు దోహదపడుతుందన్నారు.

భద్రాచలంలో నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు



కొత్తగూడెం, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాచలం పట్టణంలో నూతనంగా జిసీఎం ప్రెస్ క్లబ్ అండ్ మీడియా డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు యింది. నూతన ప్రెస్ క్లబ్ కి అధ్యక్షులుగా అన్నెం సుధీర్, కార్యదర్శిగా భూక్య సాయి కౌశిక్ తో పాటు పదిమంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు కౌశిక్ సుధీర్లు మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రెస్ క్లబ్ పనిచేస్తుందని అన్నారు. జర్నలిస్టు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి నిరంతరాయంగా పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో విలేకరులందరూ ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని అదేవిధంగా ఎప్పటినుంచో పెండింగ్లో ఉంటున్న ఇంటి స్థలాల సమస్యలను సైతం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. విలేకరులపై దాడులు జరిగితే విధించే శిక్షలు కఠినంగా ఉండాలని విలేకరుల సంక్షేమం కోసం నూతన చట్టాలను రూపొందించాలని కోరారు. నూతనంగా ఏర్పడ్డ ప్రెస్ క్లబ్ లో దారిశెట్టి సతీష్ బాబు, యాకూబ్ మియా, బి.సందీప్, పి ప్రసాద్, ఎం శ్రీనివాస్, ఆర్ వెంకటేశ్వర్లు, జి సాంబశివ, ఎండి బాలాజీ, సురేష్, బి భరత్, జి శేఖర్ రెడ్డి, బి రంగా, కే అశోక్ కుమార్ , తదితరులు పాల్గొన్ని అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సేవా కార్యక్రమాలతో పావని జన్మదిన వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన దొంతు సాయి కమల్ సతీమణి దొంతు పావని తన జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక బ్రిడ్జి స్కూల్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల మధ్య సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, వారితో ఆనందంగా గడుపుతూ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం, వారికి భోజనం అందించడం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం ఎంతో ఆనందాన్ని, ఆత్మసంతృప్తిని కలిగించిందని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభకార్యాలను ఇలాంటి చిన్నారుల మధ్య జరుపుకోవాలని సూచించారు. తద్వారా వారికి ఆనందాన్ని పంచడంతో పాటు సమాజానికి సేవాభావంతో కూడిన మంచి సందేశాన్ని అందించవచ్చని పావని పేర్కొన్నారు.

వివిఐటియూలో ఘనంగా వికసిత్ భారత్ యువ సంవాద్ - సంవిధాన్ దివస్



గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మేరా యువ భారత్ (మై భారత్), గుంటూరు, ఆంధ్రప్రదేశ్' మరియు 'గ్లోబల్ షేపర్స్ కమ్యూనిటీ, అమరావతి' సంయుక్త ఆధ్వర్యంలో నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నందు "వికసిత్ భారత్ యువ సంవాద్ – సంవిధాన్ దివస్ (రాజ్యాంగ దినోత్సవం)" కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.

ఈ వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున బీహార్‌లో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రాతినిధ్యం వహించిన వివిఐటియూ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు ఎస్.కె. ఎండీ షరీఫ్, సి. హెచ్. రాధికా దేవిలతో పాటు, క్రీడలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఎస్. ఆర్. ఎమ్ విద్యార్థి యశ్వంత్, సిద్దార్థ, వివిఐటి విద్యార్థి పి. రూపలితలను వివిఐటియూ రిజిస్ట్రార్ డా. వై. మల్లికార్జున రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ ఎన్. ఎస్. ఎస్ కోఆర్డినేటర్ డా. ఐ.ఎల్.జే. భక్తసింగ్, ఫిజికల్ డైరెక్టర్ డా. అరుణ్ కుమార్, ఎన్.సి.సి ఆఫీసర్ సయ్యద్ బిబన్ బాషా, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో పురుషులను కలవరపెడుతున్న ప్రోస్టేట్ క్యాన్సర్



- ఏపీ, తెలంగాణల్లో పెరుగుతున్న ప్రోస్టేట్ క్యాన్సర్ కేసులు
- వయసు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపిస్తున్న ముప్పు
- మూత్ర సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దన్న వైద్యులు
- ముందస్తు పరీక్షలతోనే వ్యాధిని నయం చేయడం సులభం

అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్):తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో పురుషుల ఆరోగ్యాన్ని ప్రోస్టేట్ క్యాన్సర్ తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పురుషుల్లో ఎక్కువగా నమోదవుతున్నటాప్ 4 క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటిగా నిలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. రెండు రాష్ట్రాల్లోనూ ఈ క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతుండటంతో ఇది ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది.

గణాంకాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో 2026 సంవత్సరంలో పురుషులలో కొత్త క్యాన్సర్ కేసుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ వాటా 6.9 శాతంగా (సుమారు 2,020) ఉంది. రాష్ట్రంలో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, కొలొరెక్టల్ క్యాన్సర్ల తర్వాత ప్రోస్టేట్ క్యాన్సర్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అలాగే తెలంగాణలో క్యాన్సర్ కేసుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ వాటా 6.1 శాతంగా (సుమారు 1,300 కేసులు) ఉంటుందని, ఇక్కడ కూడా ఇది నాల్గవ స్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రధానంగా వయసు పైబడిన పురుషులలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా పూర్తి స్థాయిలో నయం చేసే అవకాశాలు మెరుగవుతాయి. ప్రోస్టేట్ క్యాన్సర్‌కు సంబంధించి కొన్ని ప్రధాన హెచ్చరిక సంకేతాలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో తరచూ మూత్ర విసర్జన చేయాల్సి రావడం, మూత్ర విసర్జన ప్రారంభించడంలో ఇబ్బంది కలగడం, మూత్ర ప్రవాహం బలహీనంగా లేదా ఆగి ఆగి రావడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే మూత్రంలో గానీ, వీర్యంలో గానీ రక్తం పడటం, నడుము కింది భాగం, తుంటి లేదా కటి భాగంలో నిరంతరం నొప్పి కొనసాగడం వంటివి కూడా ఈ క్యాన్సర్ ప్రధాన లక్షణాలుగా ఉంటాయి.

అయితే ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంతేకాకుండా, పైన పేర్కొన్న లక్షణాలు కేన్సర్ కాని సాధారణ ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదల (నాన్-క్యాన్సరస్ ఎన్‌లార్జ్‌మెంట్) ఉన్నప్పుడు కూడా కనిపించే అవకాశముంది. అందువల్ల పురుషులు మూత్ర సంబంధిత మార్పులను తేలికగా తీసుకోకుండా, అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పట్టణ స్థానిక సంస్థలు పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నవంబర్ 26న ఎంటిఎంసీ, పొన్నూరు మున్సిపాలిటీల్లో పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు
- ఓటర్లందరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలి



గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటిఎంసీ), పొన్నూరు మున్సిపాలిటీలలో పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. పోలింగ్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గుంటూరు నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో ఎన్నికల నిర్వహణ చేయాలని సూచించారు.

ఎంటిఎంసీలో 62 వార్డులు, పొన్నూరు మున్సిపాలిటీలో 40 వార్డులు కలిపి మొత్తం 102 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంటిఎంసీలో 261, పొన్నూరులో 84 కలిపి మొత్తం 345 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఈ రెండు పట్టణ స్థానిక సంస్థల్లో కలిపి మొత్తం 2,97,913 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎంటిఎంసీలో 2,37,713 మంది, పొన్నూరులో 60,200 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.

పోలింగ్ నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లతో కలిపి సుమారు 2,201 మంది సిబ్బందికి విధులుకేటాయించామని తెలిపారు. వారికి నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. నవంబర్ 26వ తేదీన పోలింగ్, నవంబర్ 30వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎంటిఎంసీ ఎన్నికల కౌంటింగ్ కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశామని, పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి జీబీసీ రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేశామని పేర్కొన్నారు.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధం చేసిందని కలెక్టర్ తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎంటిఎంసీ, పొన్నూరు మున్సిపాలిటీల ఎన్నికల్లో ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అర్జీ ఇచ్చింది.. ఇస్త్రీ బండి వచ్చింది

- ఇస్త్రీ బండి పాడైదంటూ ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే నసీర్ కు అర్జీ
- జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళ ఆవేదన
- వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నసీర్
- సొంత నిధులతో మహిళకు ఇస్త్రీ బండి అందజేత



గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): 'అయ్యా.. మేము ప్రాంతానికి చెందిన వారమై ఇస్త్రీ బండి పెట్టుకుని బతుకుతున్నాం. ఇప్పుడు ఆ బండి పాడైపోవడంతో ఏ పనులు చేతగాక ఇబ్బందులు పడుతున్నాం. మమ్మల్ని మీరే ఆదుకోవాలయ్యా' అని ప్రజాదర్బార్‌ రో 11వ వార్డుకు చెందిన పార్వతి అర్జీ ఇవ్వడంతో ఎమ్మెల్యే నసీర్ వెంటనే స్పందించారు. ఇస్త్రీ బండి అందించి ఆదుకునే బాధ్యత నాది అంటూ భరోసా కల్పించారు. ఇంత మంది ప్రజలు వస్తున్నారు..తమ గురించి ఎమ్మెల్యే ఆలోచిస్తారో లేదో అనుకుంటూ అప్పటికి ఆమె వెనుదిరిగారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే పార్వతికి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. భార్యాభర్తలను బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయానికి పిలిపించి ఎమ్మెల్యే నసీర్ చేతుల మీదుగా ఇస్త్రీ బండి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ లో పార్వతి తమకు ఇస్త్రీ బండి జీవనాధారమని తెలిపడంతో అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తన సొంత నిధులతో ఆ కుటుంబానికి ఇస్త్రీ బండి అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీసీ వర్గాలకు మేలు చేసేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ. 3 వేలు ఉన్న పింఛన్ ను రూ. 4 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. ప్రజాదర్బార్ కు వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అధికార యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంబంధిత కార్యాలయాలకు పంపిస్తున్నామని చెప్పారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉండేలా ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి డివిజన్ లో కార్పొరేటర్లు తమ పరిధిలోని సమస్యలను తెలుసుకునేలా సూచనలిచ్చామని తెలిపారు. అనంతరం ఇస్త్రీ బండి అందుకున్న పార్వతి మాట్లాడుతూ ప్రతి రోజూ ఇస్త్రీ బండి వేస్తేనే కుటుంబం గడిచేదని, కొద్ది రోజులుగా బండి దెబ్బతినడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఇస్త్రీ బండి అందించిన ఎమ్మెల్యే నసీర్ కు, 11వ వార్డు కార్పొరేటర్ అహ్మద్ కు రుణపడి ఉంటామని తెలిపారు. ప్రజాదర్బార్ అర్జీ ఇచ్చిన వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉండే స్థలాలు ఏర్పాటు చేయాలి

గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉండే స్థలాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ సూచించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ పంచాయతీ ఎన్నికలపై సంబంధిత అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వేచి ఉండే స్థలాలు ఏర్పాటు చేయడం వలన ఓటర్లు క్యూ లైన్ లో ఎక్కువ సమయం నిలుచునే అవసరం ఉండదని అన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత పోలింగ్ సిబ్బంది వారు ఎక్కిన రూటు బస్సులోనే రిసెప్షన్ వద్దకు రావాలని, మధ్యలో ఎక్కడా వాహనాలు మారుటకు ప్రయత్నించొదని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు స్పష్టంగా గమనించాలని ఆదేశించారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ, పొన్నూరు పురపాలక సంఘానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, మార్కెటింగ్ సహాయ సంచాలకులు, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ ను నియమించడం జరిగిందని అన్నారు. పొన్నూరు పురపాలక సంఘానికి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ను నియమించామని తెలిపారు. ప్రత్యేక అధికారులు ఆయా రూట్లలో పరిస్థితులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి సరైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

బ్యాలెట్ పేపర్లు పక్కాగా ఉండాలి

గ్రామ పంచాయత ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామపంచాయతీ వారీగా, పోలింగ్ కేంద్రాల వారిగా ఎటువంటి తప్పులు, లోపాలు జరగకుండా బ్యాలెట్ పేపర్లు పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు సక్రమంగా ఉన్నది లేనిది ముందుగానే పరిశీలన చేయాలని ఆదేశించారు. ఎక్కడ తప్పుడు బ్యాలెట్ పేపర్ పంపిణీ చేయడం జరిగింది అనే మాట రాకూడదు అని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని అన్నారు. రూట్ అధికారులు పర్యవేక్షణ చేసి పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలు పక్కాగా ఏర్పాటు చేయాలని, వాటికి సరైన భద్రత ఉండే విధంగా చూడాలని అన్నారు.

ఈ టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అతుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా ఎన్నికల బరిలో హైదరాబాద్ మహిళ లక్ష్మి



- హైదరాబాద్‌లో పాఠశాల విద్య పూర్తి.. ఢిల్లీలో ఎంబీబీఎస్ చదివిన లక్ష్మి లంకల
- కర్ణాటకకు చెందిన మల్లేశ్‌తో వివాహం
- సిడెన్‌హామ్ స్థానం నుంచి 'ది రిపబ్లికన్' పార్టీ అభ్యర్థిగా
- నవంబర్ 28న జరగనున్న విక్టోరియా ఎన్నికలు

అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్):ఆస్ట్రేలియా రాజకీయాల్లో తెలుగు మూలాలున్న మహిళ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన లక్ష్మి లంకల ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. స్థానిక సిడెన్‌హామ్ (రాఎనవఅష్టుఎ) నియోజకవర్గం నుంచి ఆమె 'ది రిపబ్లికన్' పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. విక్టోరియా రాష్ట్ర ఎన్నికలు నవంబర్ 28న జరగనున్నాయి. సిడెన్‌హామ్ అసెంబ్లీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, బ్యాలెట్ పేపర్‌పై లక్ష్మి పేరు మూడో స్థానంలో ఉంది.

హైదరాబాద్‌తో అనుబంధం: లక్ష్మి లంకల విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే ప్రారంభమైంది. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ స్కూల్, కళాశాలలో ఆమె చదువుకున్నారు. అనంతరం ఢిల్లీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్యురాలిగా అర్హత సాధించారు. కర్ణాటకకు చెందిన మల్లేశ్‌ను వివాహం చేసుకున్న లక్ష్మి, ప్రస్తుతం ఆయనతో కలిసి ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. లక్ష్మి తల్లి ఎల్.కె. జయమ్మతో పాటు కుటుంబ సభ్యులు ప్రస్తుతం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉంటున్నారు. నగరానికి చెందిన మహిళ ఆస్ట్రేలియా వంటి దేశంలో చట్టసభ ఎన్నికల్లో పోటీ పడుతుండటంపై స్థానికులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిడెన్‌హామ్ నియోజకవర్గ ప్రజలనుద్దేశించి లక్ష్మి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో విని, కమ్యూనిటీ గళాన్ని అసెంబ్లీలో బలంగా వినిపించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఈ ప్రాంతానికి ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు నిరంతరం శ్రమిస్తానని, ఓటర్లు తనను ఆదరించి గెలిపించాలని ఆమె కోరారు. స్థానిక ఓటర్లను నేరుగా కలుస్తూ ఆమె ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.

తిరుమలలో తమిళనాడు భక్తుడు హఠాన్మరణం



తిరుమల, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): కలియుగ వైకుంఠమైన తిరుమల పుణ్యక్షేత్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. తమిళనాడుకు చెందిన సదరు భక్తుడు అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోవడంతో తోటి భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

వివరాల్లోకి వెళితే.. తమిళనాడులోని తంజావూరు ప్రాంతానికి చెందిన వాయల్‌రాజ్ (55) అనే వ్యక్తి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చాడు. ఈ క్రమంలో తిరుమలలోని రాంబగీచా బస్టాండ్ సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా ఆయనకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అక్కడి వారు వెంటనే స్పందించి సహాయం అందించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. అనంతరం మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా ఆయనను తంజావూరు నివాసి వాయల్‌రాజ్‌గా గుర్తించారు. ఈ దుర్ఘటనపై తంజావూరులోని ఆయన కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం అందించారు. దైవ దర్శనం కోసం వచ్చి ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం పట్ల భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఒక చేతిలో 6 నెలల పాప.. పార్లమెంటులో ప్రసంగం

- ఈ తల్లికి నెటిజన్ల ప్రశంసలు
- ఆరు నెలల కుమార్తెతో కలిసి ఆస్ట్రేలియా సెనేట్‌కు హాజరైన ఫాతిమా పేమాన్
- ఆన్‌లైన్ సేఫ్టీ బిల్లుపై బిడ్డను చేతుల్లోకి తీసుకునే ప్రసంగించిన సెనేటర్
- చిన్నారితో సరదాగా దోబూచులాడిన వెనుక సీటు సభ్యురాలు లిడియా థోర్ప్
- సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్న పార్లమెంట్ వీడియో
- నిబంధనల ప్రకారం చట్టసభల్లోకి పిల్లలను అనుమతిస్తున్న ఆస్ట్రేలియా



అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్):
ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో ఒక అరుదైన, హృద్యమైన దృశ్యం చోటుచేసుకుంది. పశ్చిమ ఆస్ట్రేలియాకు చెందిన ఇండిపెండెంట్ సెనేటర్ ఫాతిమా పేమాన్ తన ఆరు నెలల కుమార్తెను ఎత్తుకుని చట్టసభలో ప్రసంగించి అందరి దృష్టినీ ఆకర్షించారు. రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే మాతృత్వాన్ని సమర్థంగా బ్యాలెన్స్ చేయవచ్చని ఆమె నిరూపించారు.

ఆస్ట్రేలియా సెనేట్‌లో నవంబర్ 25న 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (డిజిటల్ డ్యూటీ ఆఫ్ కేర్) బిల్లు 2026'పై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా సెనేటర్ ఫాతిమా పేమాన్ తన ఆరు నెలల కుమార్తె ఆలియాను చేతుల్లోకి తీసుకుని డిస్పాచ్ బాక్స్ వద్ద నిల్చున్నారు. ఒకవైపు చిన్నారిని ప్రేమగా లాలిస్తూనే, మరోవైపు బిల్లుపై తన వాదనలను వినిపించారు.

ఈ సమయంలో ఫాతిమా వెనుక సీట్లో కూర్చున్న మరో ఇండిపెండెంట్ సెనేటర్ లిడియా థోర్ప్.. ఆ చిన్నారితో సరదాగా దోబూచులాడుతూ (పీక్-ఎ-బూ) మురిపించారు. పార్లమెంట్ చర్చల మధ్య చోటుచేసుకున్న ఈ ఆహ్లాదకరమైన సన్నివేశం తాలూకు వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.

పశ్చిమ ఆస్ట్రేలియా నుంచి పదవిలో ఉండగానే బిడ్డకు జన్మనిచ్చిన మొదటి మహిళా సెనేటర్‌గా ఫాతిమా పేమాన్ గుర్తింపు పొందారు. ఆమె కుమార్తె 2026 మే నెలలో జన్మించింది. గతంలో కూడా ఆమె పార్లమెంట్ వేదికగా మాతృత్వపు అనుభవాలు, ప్రసవానంతర సవాళ్లు, పేరెంటింగ్‌లోని శారీరక, మానసిక ఒత్తిళ్లు మరియు విధుల్లోకి తిరిగి చేరడం వంటి అంశాలపై పలుమార్లు మాట్లాడారు.

ఆస్ట్రేలియా సెనేట్ నిబంధనల ప్రకారం మహిళా ఎంపీలు తమ చంటిపిల్లలను సభలోకి తీసుకురావడానికి వెసులుబాటు ఉంది.

2016లో సవరించిన నిబంధనల (స్టాండింగ్ ఆర్డర్స్) ప్రకారం.. సభా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా, సెనేట్ ప్రెసిడెంట్ అనుమతితో చిన్నపిల్లలను సభలోకి తీసుకురావడమే కాకుండా వారికి పాలివ్వడానికి కూడా అనుమతిస్తారు.

చట్టసభల్లో మహిళలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, రాజకీయాల్లో మాతృత్వాన్ని సాధారణ అంశంగా మార్చడంలో ఈ పరిణామం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని పలువురు ప్రశంసిస్తున్నారు. బాధ్యతను, బంధాన్ని ఏకకాలంలో చక్కగా నిర్వర్తించిన ఫాతిమా పేమాన్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

‘ఆకాశంలో ఒక తార’ సినిమా ఎంతో స్ఫూర్తిదాయకం

- ‘ఆకాశంలో ఒక తార’ చిత్రాన్ని వీక్షించిన ఏపీ హోంమంత్రి అనిత
- కుటుంబ సమేతంగా చూడదగ్గ అద్భుత చిత్రమని వెల్లడి
- నటీనటులు దుల్కర్, సాత్వికల అభినయంపై ప్రత్యేక ప్రశంసలు
- దర్శకుడు పవన్ సాధినేని, నిర్మాతలకు మంత్రి శుభాకాంక్షలు

అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్):దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ‘ఆకాశంలో ఒక తార’ చిత్రంపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశంసలు కురిపించారు. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ఆమె, చిత్ర విశేషాలను పంచుకుంటూ సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కథాంశం, భావోద్వేగ సన్నివేశాలు, సమాజానికి ఇచ్చే స్ఫూర్తిదాయక సందేశం తనను ఎంతగానో ఆలోచింపజేశాయని ఆమె పేర్కొన్నారు.

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి తప్పక చూడాల్సిన సినిమా ఇదని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ఆడపిల్లల కలలకు తల్లిదండ్రుల నమ్మకం, ప్రోత్సాహం తోడైతే సమాజం విధించే ఎలాంటి హద్దులనైనా అధిగమించవచ్చని ఈ చిత్రం చాటిచెప్పిందని అన్నారు. ఆకాశాన్ని మాత్రమే కాకుండా, అంతరిక్షాన్నే తన గమ్యంగా మార్చుకోగల సత్తా ఆడపిల్లకు ఉందని, ఆమె ఆశయాలకు రెక్కలు ఇవ్వాలే తప్ప సరిహద్దులు గీయకూడదనే గొప్ప సందేశాన్ని దర్శకుడు ఎంతో హృద్యంగా ఆవిష్కరించారని ఆమె కొనియాడారు. చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించిన దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి తమ సహజ నటనతో పాత్రలకు ప్రాణం పోశారని మంత్రి ప్రశంసించారు. మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయి చిత్ర విజయానికి మరింత బలాన్ని చేకూర్చారని పేర్కొన్నారు. ఇంతటి చక్కటి కథను ఎంచుకుని వెండితెరపై అద్భుతంగా తీర్చిదిద్దిన దర్శకుడు పవన్ సాధినేనికి ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. నిరంతరం విభిన్నమైన, భావోద్వేగభరిత కథలను ప్రేక్షకులకు అందిస్తున్న స్వప్న సినిమా నిర్మాతలు స్వప్న దత్, ప్రియాంక దత్‌లతో పాటు, తెలుగు చిత్రసీమలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ మంత్రి అనిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రపంచ మేయర్ల వేదిక సదస్సులో గుంటూరు మేయర్, కమిషనర్



గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): ముంబైలో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ మేయర్ల వేదిక-2026 అంతర్జాతీయ సదస్సు తొలి రోజు సమావేశాల్లో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 25న ముంబైలోని ఫెయిర్‌మాంట్ హోటల్‌లో ఈ సదస్సు నిర్వహించారు.

ఈ అంతర్జాతీయ వేదికపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేయర్లు, నగర పాలక సంస్థల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, పట్టణాభివృద్ధి నిపుణులతో కలిసి గుంటూరు ప్రతినిధులు పలు అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. 2047 నాటికి నగరాల రూపురేఖలను మార్చే అభివృద్ధి ప్రణాళికలు, మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో నగరాల మధ్య పరస్పర సహకారం వంటి అంశాలపై సమావేశాల్లో చర్చించారు.

కృత్రిమ మేధ, సాంకేతిక పరిజ్ఞానంతో పట్టణ పాలనను మెరుగుపరచడం, ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే నగరాల నిర్మాణం, పట్టణ వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార నగరాల విధానం ద్వారా వనరుల వినియోగం, వ్యర్థాల తగ్గింపు, అభివృద్ధికి కొత్త మార్గాలు అన్వేషించడం, ప్రపంచ పెట్టుబడులను స్థానిక అభివృద్ధికి అనుసంధానించడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. సుస్థిర, సమగ్ర, విపత్తులను తట్టుకునే సామర్థ్యం కలిగిన పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ఉత్తమ విధానాలు, అనుభవాలను పంచుకునేందుకు ప్రపంచ మేయర్ల వేదిక కీలక అంతర్జాతీయ వేదికగా నిలుస్తోంది. నగర పాలన, పట్టణాభివృద్ధిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సమన్వయాన్ని బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ నగరాల నిర్మాణానికి ఈ సదస్సు చర్చలు దోహదపడనున్నాయి.

పెండింగ్ జీతాలు చెల్లించాలని

పాఠశాల విద్యా కమిషనర్‌కు వినతి



మంగళగిరి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లో ఉన్న సమయంలో బదిలీ అయిన క్లస్టర్ టీచర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ ఏ. తమీమ్ అన్సారీయాను మంగళగిరిలోని కమిషనరేట్‌లో కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ, నిషేధ సమయంలో బదిలీ అయిన క్లస్టర్ టీచర్ల జీతాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వారికి తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల పరిసరాల్లో జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్ తదితర అనారోగ్యకరమైన ఆహార పదార్థాల విక్రయాలను నిషేధించాలని సూచించారు. జంక్ ఫుడ్ వినియోగం వల్ల విద్యార్థులకు కలిగే ఆరోగ్య సమస్యలపై పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సురేష్ బాబు సమర్పించిన వినతులపై కమిషనర్ తమీమ్ అన్సారీయా సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పులవర్తి ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల పనితీరు మెరుగుపడాల్సిందే

- నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోండి
- మీ బాధ్యతల నిర్వహణ పట్ల సంతృప్తికరంగా ఉన్నారా?
- ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ హితవు



అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ బోధనాసుపత్రుల పనితీరు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ స్పష్టం చేశారు. వీటికి నేతృత్వం వహించే ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు నాయకత్వ లక్షణాలను మరింత పెంచుకోవాలని హితవు పలికారు. ప్రత్యక్షంగా బోధనాసుపత్రుల పనితీరును పర్యవేక్షించే ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు విధుల నిర్వహణ తీరుపై ఆత్మపరిశీలన చేసుకోవాలని ఉద్బోధించారు. ఉన్నత వైద్య సేవలను అందించడంలో కీలకంగా వ్యవహరించే బోధనాసుపత్రుల పనితీరుపై ప్రజల సంతృప్త స్థాయి మిగిలిన ఆసుపత్రుల కంటే తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలవారీగా బోధనాసుపత్రుల పనితీరుపై సమీక్ష: విజయవాడలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో జిల్లాలవారీగా బోధనాసుపత్రుల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లతో వాటి పనితీరుపై వర్క్‌షాప్ జరిగింది. బుధవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి హాజరైన కార్యదర్శి వీరపాండియన్ మాట్లాడుతూ ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లుగా నియమితులైనవారిలో ఎంతమంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారో స్వీయ సమీక్ష చేసుకోవాలని తెలిపారు.

ఎందుకు వైద్య సేవలు తగ్గుతున్నాయి: ప్రైవేటు ఆసుపత్రుల కంటే బోధనాసుపత్రుల్లో వైద్య సేవలు తగ్గుతున్నాయని, కానీ నియామకాలు, నిర్వహణ వ్యయం బాగా పెరుగుతోందన్నారు. ఆసుపత్రుల్లో పారిశుధ్య పరిస్థితులకు తగినట్లు మార్కులు వేయడంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమరుపాటు తగదని ఆయన తెలిపారు.

రోగుల అవసరాలు, పరిష్కారాలపై చొరవ చూపాలి: రోగుల వైద్య సేవలు, అవసరాలు, సౌకర్యాల కల్పన, రద్దీ నియంత్రణ వంటి విషయాల్లో సూపరింటెండెంట్లు తీసుకునే నిర్ణయాలు సత్ఫలితాలిస్తాయన్నారు. పరిమితుల మధ్య తగిన నిర్ణయాలు చొరవతో తీసుకునే సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు రోగులకు మేలు చేకూరుస్తాయన్నారు. విధులకు హాజరైన వైద్యులు పూర్తిస్థాయిలో ఆసుపత్రుల్లో ఉంటున్నారా లేదా అన్నది కూడా పరిశీలిస్తామని తెలిపారు. వైద్యుల హాజరు కచ్చితంగా ఉంటే సదరు ఆసుపత్రుల పనితీరు మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజల సంతృప్తి స్థాయి పెరగాల్సిందే: వైద్య సేవల పట్ల ప్రభుత్వం సేకరించే ప్రజల సంతృప్త స్థాయి తక్కువగా ఉండడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు డీఎంఈ తరచూ వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోందని, ఇందుకు బాధ్యులైన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లలో ఇప్పటికైనా మార్పు రావాలని పేర్కొన్నారు.

ప్రజల సంతృప్త స్థాయి తక్కువగా ఉండడంపై ముఖ్యమంత్రి, మంత్రి రానున్న రోజుల్లో ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లతో సమీక్షించే అవకాశాలు కూడా లేకపోలేదని వెల్లడించారు.

డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో మంగళ, బుధవారాల్లో అన్నిబోధనాసుపత్రుల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, డీఎంఈ అదనపు సంచాలకులు డాక్టర్ రాధికారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు గెలుపును చీకటి విజయం అనడం దుర్మార్గం :వర్ల రామయ్య

- సాక్షి పత్రికపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు తీవ్ర విమర్శలు



మంగళగిరి, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): ప్రజల మద్దతుతో వరుస విజయాలు సాధిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయాన్ని చీకటి గెలుపుగా అభివర్ణించడం ప్రజల తీర్పును అవమానించడమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య విమర్శించారు. బుధవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన తీవ్రంగా స్పందించారు. చంద్రబాబును కించపరచడం, ఆయన విజయాలపై విమర్శలు చేయడమే సాక్షి పత్రిక లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు.

చంద్రబాబు ఏడు దఫాలుగా ఎన్నికల్లో విజయాలు సాధించారని, ప్రతి ఎన్నికలోనూ 50 వేలకుపైగా మెజారిటీతో కుప్పం ప్రజలు ఆయనకు మద్దతు తెలిపారని వర్ల రామయ్య పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన కుప్పం నియోజకవర్గం ప్రస్తుతం అభివృద్ధిలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోటీపడుతోందని అన్నారు. ప్రజాదరణతో ఎన్నికల్లో గెలిచిన నాయకుడి విజయాన్ని చీకటి గెలుపుగా అభివర్ణించడం సరికాదని విమర్శించారు.

151 అసెంబ్లీ స్థానాలు ఇచ్చి అధికారంలోకి తీసుకొచ్చిన ప్రజలే గత ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని 11 స్థానాలకు పరిమితం చేశారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీకి ప్రజల మద్దతు లభించడం లేదని, ప్రజలు ఆ పార్టీని మళ్లీ అధికారంలో చూడటానికి సిద్ధంగా లేరని వ్యాఖ్యానించారు. చంద్రబాబుపై అక్కసుతోనే సాక్షి పత్రికలో విమర్శనాత్మక కథనాలు ప్రచురిస్తున్నారని అన్నారు.

పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల నిబంధనలకు సంబంధించి ప్రచురించిన కథనాలను కూడా వక్రీకరణగా అభివర్ణించిన వర్ల రామయ్య, ఎన్నికల్లో అక్రమాలు జరిగితే సంబంధిత ఎన్నికల అధికారులు, ఏజెంట్ల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ ప్రక్రియ, ఫారం 17జ, సంతకాలు, కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. చంద్రబాబుపై విమర్శలు చేయడం, ఆయనను కించపరచడమే సాక్షి పత్రిక ధోరణిగా మారిందని ఆరోపించారు.

రెండేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని జగన్ చేస్తున్న ప్రకటనలకు, ప్రస్తుతం ఎదుర్కొంటున్న రాజకీయ పరిస్థితులకు పొంతన లేదని వర్ల రామయ్య విమర్శించారు. ప్రజల మద్దతు లేదన్న భయంతోనే చంద్రబాబు విజయాలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల తీర్పును తప్పుబట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఇ.వి.ఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లా కేంద్రంలోని ఇ.వి.ఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ బుధవారం తనిఖీ చేశారు. ఇ.వి.ఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్‌లను పరిశీలించారు. ఇ.వి.ఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె.ఖాజావలి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణా రెడ్డి, రహదారులు భవనాలు శాఖ డిఇ హజరతయ్య, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, తహసిల్దార్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపుల్లో వేగవంతమైన సేవల కోసం ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకోండి

గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): పన్నుల చెల్లింపుల్లో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు నగర ప్రజలు ఆన్‌లైన్ పేమెంట్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆన్‌లైన్ పన్నుల చెల్లింపు విధానం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

పన్నులు చెల్లించేందుకు నగర పాలక సంస్థ కార్యాలయాల చుట్టూ తిరగడం, క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా సులభంగా చెల్లింపులు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక పరిపాలన శాఖ అధికారిక వెబ్‌సైట్ https://cdma.ap.gov.in/ ద్వారా ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రైనేజీ పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల విధానం ద్వారా సెలవు దినాలతో సంబంధం లేకుండా ఎప్పుడైనా, నిమిషాల వ్యవధిలో పన్నులు చెల్లించే అవకాశం ఉందన్నారు. ప్రతి చెల్లింపుకు వెంటనే ఆన్‌లైన్ రసీదు అందుబాటులో ఉంటుందని, ఈ విధానం సేవలను వేగవంతం చేయడంతో పాటు పారదర్శకతను పెంపొందించి అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుందని వివరించారు. నగర అభివృద్ధిలో పన్నుల చెల్లింపు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా సకాలంలో తమ పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించి నగర ప్రగతికి సహకరించాలని కమిషనర్ కోరారు.

ఏపీ టెన్త్ పరీక్షల ఫీజు రివైజ్డ్ షెడ్యూల్ విడుదల

- వివరాలు వెల్లడించిన పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి



అమరావతి,నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్):ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపు ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో విడుదల చేసిన ఫీజు చెల్లింపు గడువులను సవరిస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం తాజాగా కొత్త రివైజ్డ్ షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నూతన గడువులను గమనించి ఫీజు చెల్లించాలని అధికారులు స్పష్టం చేశారు.

ఫీజు చెల్లింపు రివైజ్డ్ షెడ్యూల్ జాబితా:

- నవంబర్ 26 నుంచి డిసెంబర్ 5 వరకు: ఎలాంటి అపరాధ రుసుము ఉండదు
- డిసెంబర్ 6 నుంచి డిసెంబర్ 9 వరకు: రూ. 50 ఆలస్య రుసుము
- డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 13 వరకు: రూ. 200 ఆలస్య రుసుము
- డిసెంబర్ 14 నుంచి డిసెంబర్ 18 వరకు: రూ. 500 ఆలస్య రుసుము

పరీక్ష ఫీజు వివరాలు:

- మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు రాసే రెగ్యులర్ అభ్యర్థులు: రూ. 125
- మూడు సబ్జెక్టుల వరకు మాత్రమే రాసేవారు: రూ. 110
- వృత్తివిద్య (వొకేషనల్) అభ్యర్థులు: అదనంగా రూ. 60
- వయోపరిమితి సడలింపు కోరే అభ్యర్థులు: రూ. 300

ఈ సవరించిన వివరాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నిర్దిష్ట గడువులోగా ఫీజు చెల్లించేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.

తాడేపల్లి-మంగళగిరి, పొన్నూరు ఎన్నికలకు 2,025 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

- ఎన్నికల విధులపై సిబ్బందికి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ దిశానిర్దేశం





గుంటూరు, నవంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్): తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మొత్తం 2,025 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గురువారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించి ఎన్నికల విధులపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఓటర్లతో అనవసరంగా మాట్లాడకుండా, ఎలాంటి పక్షపాతానికి తావివ్వకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సిబ్బంది లాఠీ, విజిల్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీల గుంపులు, ప్రచార కార్యకలాపాలు, అనధికార ఏర్పాట్లకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువాలు, గుర్తులతో 200 మీటర్ల పరిధిలో ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి పార్టీ తరపున ఒక్క పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చూడాలని ఆదేశించారు. ఓటర్లను నిబంధనల ప్రకారం తనిఖీ చేసి నిషేధిత వస్తువులు పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా చూడాలని, మీడియా ప్రతినిధులు అనుమతి పాసులతో నిబంధనల మేరకు మాత్రమే అనుమతించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులను అనుమతించకూడదని స్పష్టం చేశారు.

రూట్ మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డబ్బు, మద్యం పంపిణీ, ఇతర అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు. పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, ఆ సమయానికి క్యూలో ఉన్న ఓటర్లకు ప్రిసైడింగ్ ఆఫీసర్ అనుమతితో ఓటు వేసే అవకాశం కల్పించేలా సహకరించాలని సూచించారు. ఫోటోలు యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ ద్వారా సమాచారం అందించాలని, వైర్‌లెస్ ఎనఖీ సెట్లు, సెల్‌ఫోన్ల ద్వారా ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలని ఆదేశించారు.

తాడేపల్లి-మంగళగిరి కార్పొరేషన్ ఎన్నికల కోసం 1,443 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. వీరిలో ఒక అదనపు ఎస్పీ, ఏడుగురు డీఎస్పీలు, 19 మంది సీఐలు, 96 మంది ఎస్సైలు, 182 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 739 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, 299 మంది మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారు. భద్రత కోసం 48 రూట్ మొబైల్ పార్టీలు, 12 స్ట్రైకింగ్ ఫోర్స్ పార్టీలు, ఒక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలో 119 పోలింగ్ లొకేషన్లు, 161 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు.

పొన్నూరు పురపాలక ఎన్నికల కోసం 582 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో ఒక అదనపు ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 28 మంది ఎస్సైలు, 75 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 264 మంది పోలీసు కానిస్టేబుళ్లు/మహిళా కానిస్టేబుళ్లు, 40 మంది హోంగార్డులు, 165 మంది మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారు. 11 మొబైల్ రూట్లు, నాలుగు స్ట్రైకింగ్ ఫోర్స్ పార్టీలు, ఒక స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. పొన్నూరు పరిధిలో 32 పోలింగ్ లొకేషన్లు, 80 పోలింగ్ స్టేషన్లు ఉండగా, నాలుగు హైపర్ సెన్సిటివ్ లొకేషన్లలో 12 పోలింగ్ స్టేషన్లు, ఎనిమిది సెన్సిటివ్ లొకేషన్లలో 25, 20 సాధారణ లొకేషన్లలో 43 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com